


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 320 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కడప మంగళవారం 21 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :320 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED :KADAPA TUE 21JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur






## ఉక్రెయిన్‌లో కార్గో నౌకపై దాడి..

## నలుగురు భారతీయులతో సహా పలువురు మృతి

- ఉక్రెయిన్‌లోని ఒడెస్సా సమీపంలో పౌర నౌకపై క్షిపణి దాడి
- ధాన్యం లోడుతో వెళుతున్న పౌర కార్గో నౌక లక్ష్యంగా దాడి
- దాడిలో మరో భారతీయుడికి తీవ్ర గాయాలు

పెన్ పవర్ డెస్క్:ఉక్రెయిన్‌లోని ఒడెస్సా నౌకాశ్రయం సమీపంలో పెను విషాదం చోటుచేసుకుంది. ధాన్యంతో వెళుతున్న ఒక పౌర కార్గో నౌకపై క్షిపణి దాడి చేయడంతో, నలుగురు భారతీయులతో సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. నల్ల సముద్రంలో పౌర నౌకల భద్రతకు పొంచి ఉన్న ముప్పును ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. కాగా, ఈ క్షిపణి దాడి చేసింది రష్యానే అని ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. టర్కీకి చెందిన, గినియా-బిస్సావ్ పతాకంతో ప్రయాణిస్తున్న 'గోల్డెన్ లియో' అనే బల్క్ క్యారియర్ నౌక, జూలై 19న ఒడెస్సా పోర్టు నుంచి బయలుదేరిన

- మిగతా 2లో

## కొండపనేని టౌన్‌షిప్ పార్కులో మంత్రి నారా లోకేశ్ ముఖాముఖి...



- మంగళగిరిలో తల్లికి వందనం లబ్ధిదారులతో మంత్రి లోకేశ్ భేటీ
- పథకం అమలు, ఆర్థిక సాయం వినియోగంపై ఆరా
- విద్యార్థుల తల్లుల నుంచి సలహాలు, సూచనల స్వీకరణ
- కొండపనేని టౌన్‌షిప్ పార్కులో ముఖాముఖి కార్యక్రమం

- మిగతా 2లో

## తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త రూపు.. నూతన వాహనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు



- రాష్ట్రవ్యాప్తంగా 500 నూతన వాహనాలతో సేవలు అందించనున్న ప్రభుత్వం
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు ఉచిత, సురక్షిత రవాణా
- జీపీఎస్, ఏసీ, సీట్ బెల్టుల వంటి ఆధునిక సౌకర్యాలతో వాహనాల రూపకల్పన
- ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలకు ప్రయోజనం చేకూరనున్న అంచనా

2లో



## సీజేపీ ఆందోళనతో దద్దరిల్లిన

## దేశ రాజధాని

- సీజేపీ కార్యకర్తలపైకి టియర్ గ్యాస్.. ఢిల్లీలో ఉద్రిక్తత.. పార్లమెంట్ గేట్లు బంద్!
- నీట్ అంశంపై సీజేపీ 'చలో సంసద్' పిలుపు
- పార్లమెంట్ వైపు ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- టియర్ గ్యాస్, లాఠీచార్జ్‌తో ఉద్రిక్తత
- ఢిల్లీలో ఇంటర్నెట్ సేవల నిలిపివేత
- అభిజీత్ దీప్కే నిరాహార దీక్ష విరమణ

- మిగతా 2లో

## భారతదేశ చరిత్రలోనే అత్యంత యువత వ్యతిరేక ప్రధాని మోడీనే



పెన్ పవర్ డెస్క్: ప్రధాని మోడీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే యువత అత్యంత వ్యతిరేక ప్రధాని మోడీనే అని అభివర్ణించారు. పరీక్షలు నిర్వహించడంలో దారుణంగా విఫలమైన విద్యాశాఖ మంత్రిని కనీసం రాజీనామా చేయమని కోరలేని అసమర్థ ప్రధాని మోడీ అని విమర్శించారు. నీట్ పేపర్ 2026 లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

- మిగతా 2లో

## విపక్షాల నిరసనలతో హోరెత్తిన పార్లమెంటు...

## ఉభయసభలు వాయిదా



- నీట్ లీక్‌పై విపక్షాల నిరసనలతో ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాలు
- తీవ్ర గందరగోళం నడుమ ఉభయ సభలు రోజంతటికి వాయిదా
- నీట్ అంశాన్ని ప్రస్తావించకుండా మాట్లాడిన ప్రధాని మోదీ
- విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ పార్లమెంట్ వద్ద ఆందోళనలు
- ఆగస్టు 13 వరకు 19 రోజుల పాటు కొనసాగనున్న సమావేశాలు

2లో



## హైదరాబాద్ కోర్టు కీలక తీర్పు:

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

పెన్ పవర్ డెస్క్:మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో హైదరాబాద్ 12వ అదనపు సెషన్స్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రేమ పేరుతో నమ్మించి ఒక నిరుపేద మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం

- మిగతా 2లో

## కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

- నీట్ వివాదంపై కేంద్రమంత్రి నడ్డాతో భేటీ
- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- ఢిల్లీలో 'చలో సంసద్' ర్యాలీ... నిరసనకారులపై లాఠీఛార్జ్
- సమస్యను అంతర్గతంగా చర్చిస్తానని నడ్డా హామీ
- డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టీకరణ

- మిగతా 2లో





## అయోధ్య టెంపుల్ విరాళాల చోరీ సాధారణ నేరమే..

## రాజకీయం చేయొద్దు

- అయోధ్య విరాళాల దొంగతనం కేసును రాజకీయం చేయవద్దని సుప్రీంకోర్టు
- ఇది కేవలం నేరానికి సంబంధించిన సాధారణ కేసు అన్న ధర్మాసనం
- సీబీఐ విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్లపై కోర్టు విచారణ
- యూపీ పోలీసుల దర్యాప్తుపై నివేదికను పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### కొండపనేని టౌన్‌షిప్ పార్కులో మంత్రి నారా లోకేశ్ ముఖాముఖి...

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం అమలు తీరును తెలుసుకునేందుకు విద్య, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ లబ్ధిదారులతో నేరుగా సమావేశమయ్యారు. తన నియోజకవర్గమైన మంగళగిరిలోని బైపాస్ రోడ్డులో ఉన్న కొండపనేని టౌన్‌షిప్ పార్కులో విద్యార్థుల తల్లులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం పిల్లల చదువులకు ఏ విధంగా ఉపయోగపడుతోందో మంత్రి లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. పథకం అమలులో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకునేందుకు లబ్ధిదారులతో ఆయన స్వయంగా మాట్లాడారు. అదే సమయంలో, ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు తల్లుల నుంచి పలు సలహాలు, సూచనలను మంత్రి లోకేశ్ స్వీకరించారు. లబ్ధిదారులు చెప్పిన విషయాలను ఆయన ఓపికగా వింటూ, వాటిని పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయి అభిప్రాయాలతో పథకాన్ని మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగినట్లు తెలుస్తోంది.

### తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త రూపు.. నూతన వాహనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో మాతా--శిశు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం, 'తల్లీ--బిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సురక్షితమైన, నాణ్యమైన రవాణా సౌకర్యం కల్పించేందుకు సిద్ధం చేసిన 500 నూతన వాహనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు.

ఈ సందర్భంగా వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు, ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలను సీఎం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా తల్లీబిడ్డల అవసరాలకు అనుగుణంగా వాహనాల్లో చేసిన మార్పులను అధికారులు ఆయనకు వివరించారు. ఈ సేవలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేలా వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను పరిశీలించి, వాటికి ఆమోదం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలను, వారి నవజాత శిశువులను, సహాయకులను ఉచితంగా, క్షేమంగా వారి ఇళ్లకు చేర్చడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. దీంతో పాటు, అధిక రక్తహీనతతో బాధపడే గర్భిణులు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు తీసుకురావడానికి కూడా ఈ వాహనాలను వినియోగించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 500 ాఖు‌ం/వీఖు‌ం వాహనాల ద్వారా అందించే ఈ సేవలతో ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలు లబ్ధి పొందనున్నారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ కొత్త వాహనాల్లో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు పెద్దపీట వేశారు. వెనుక సీట్లలో సైతం సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కి దిగేందుకు వీలుగా ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్ (ఏసీ), ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక పరికరాలు వంటివి ఏర్పాటు చేశారు. ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అనుసంధానించడం ద్వారా వాటి కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించనున్నారు. వాహనాలపై అధికారిక స్టిక్కరింగ్ పూర్తి చేసి, త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, జాతీయ ఆరోగ్య మిషన్ (చీఎవీ) అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సీజేపీ ఆందోళనతో దద్దరిల్లిన దేశ రాజధాని

కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన చలో సంసద్ నిరసన ర్యాలీ మరింత ఉద్రిక్తంగా మారింది. ఉదయమే నిరసనకారులను జంతర్ మంతర్ వద్ద నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ.. వాళ్లు ముందుకు సాగారు. పలు అంచెల్లో ఏర్పాటు చేసిన భద్రతను దాటుకొని మరీ దాదాపు పార్లమెంటు సమీపంలోకి చేరుకున్నారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్ ప్రయోగించాల్సి వచ్చింది. లాఠీఛార్జ్ కూడా చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొని తోపులాట జరిగింది. దీంతో పలువురు నిరసనకారులతో పాటు పోలీసులకూ గాయాలయ్యాయి. ఇదంతా పార్లమెంటుకు 200 మీటర్ల దూరంలోనే జరిగింది. ఈ క్రమంలో పార్లమెంట్ ప్రధాన ద్వారాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. కొన్ని గేట్లను మూసివేశారు. ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేశారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు తమ కార్యకర్తలు ప్రశాంతంగా ఉండాలని సీజేపీ పిలుపునిచ్చింది. శాంతియుత పోరాటంతోనే లక్ష్యాన్ని సాధిస్తామని సోషల్ మీడియాలో పేర్కొంది. ఈ ఆందోళనకు ముందు పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నిరాహార దీక్ష చేపట్టారు. అయితే ఆత్మహత్య చేసుకున్న ఓ నీట్ విద్యార్థిని తండ్రి విజ్ఞప్తి మేరకు దీక్ష విరమించినట్లు సీజేపీ తెలిపింది. పార్లమెంట్ ర్యాలీకి నాయకత్వం వహించాల్సిన అవసరం ఉందని ఆయనను ఒప్పించడంతో దీక్ష ముగిసిందని పార్టీ వెల్లడించింది. జంతర్‌మంతర్ వద్ద మరో వివాదం కూడా చెలరేగింది. ఎలాంటి అత్యవసర పరిస్థితి లేకపోయినా ఒక అంబులెన్స్‌ను నిరసన ప్రాంగణంలోకి పంపారని సీజేపీ ఆరోపించింది. దాంతో తొక్కిసలాట జరిగే పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది. శాంతియుతంగా జరుగుతున్న ఆందోళనను భంగం కలిగించేందుకే ఇలా చేశారని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది.

### విపక్షాల నిరసనలతో హోరెత్తిన పార్లమెంటు... ఉభయసభలు వాయిదా

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం వాడివేడిగా ప్రారంభమయ్యాయి. నీట్-యూజీ పేపర్ లీక్ కుంభకోణంపై తక్షణమే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో, తొలిరోజే ఉభయ సభలు రోజంతటికీ వాయిదా పడ్డాయి. ఈ సమావేశాలు ఆగస్టు 13 వరకు జరగనుండగా, మొత్తం 19 పనిదినాలు ఉన్నాయి. ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా దివంగత సభ్యులకు నివాళులర్పించి, సభ గౌరవాన్ని కాపాడాలని సభ్యులను కోరారు. కానీ, ప్రతిపక్ష సభ్యులు నీట్ వివాదం, విద్యార్థుల ఆత్మహత్యలపై నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో స్పీకర్ మొదట సభను మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆ తర్వాత కూడా గందరగోళం కొనసాగడంతో రేపటికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే తరహా దృశ్యాలు కనిపించాయి. సమావేశాలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడుతూ.. స్కైరూట్ రాకెట్ ప్రయోగం, హైడ్రోజన్ రైలు వంటి విజయాలను ప్రస్తావిస్తూ దేశ యువతను ప్రశంసించారు. అయితే, దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నీట్ వివాదంపై ఆయన ఏమీ మాట్లాడలేదు. మరోవైపు, నీట్ లీక్‌లకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ (కాక్‌రోచ్ జనతా పార్టీ) ఆధ్వర్యంలో జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వరకు ర్యాలీ చేపట్టారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ పరిసరాల్లో ఢిల్లీ పోలీసులు, ఆర్‌ఏఎఫ్ బలగాలతో భారీ భద్రత ఏర్పాటు చేసి, నిషేధాజ్ఞలు విధించారు. ఈ సమావేశాల్లో హోం మంత్రి అమిత్ షా 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు'ను ప్రవేశపెట్టనున్నారు.

### హైదరాబాద్ కోర్టు కీలక తీర్పు: పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- మొదటి పేజి తరువాయి

కఠిన శిక్ష విధించింది.

పోక్సో చట్టం కింద నమోదైన ఈ కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. దీంతో పాటు రూ. 10 వేల జరిమానా కూడా విధించింది. ఒకవేళ ఈ జరిమానా చెల్లించకపోతే, నిందితుడు మరో 6 నెలల పాటు అదనంగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. 2021లో కామాటిపుర పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘోరం వెలుగుచూసింది. బాలికపై లైంగిక దాడి జరిగినట్లు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. అత్యంత వేగంగా దర్యాప్తు పూర్తి చేశారు. నిందితుడిపై ఉన్న అభియోగాలను రుజువు చేసేందుకు పక్కా సాంకేతిక ఆధారాలను కోర్టుకు సమర్పించారు. పోలీసులు సమర్పించిన టిష్టమైన ఆధారాలను పరిశీలించిన గౌరవ న్యాయస్థానం.. నిందితుడిని దోషిగా తేల్చి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష ఖరారు చేసింది. బాధితురాలికి న్యాయం జరిగేలా పక్కా ఆధారాలతో నిందితుడికి శిక్ష పడేలా చేసిన పోలీసు అధికారులను ఉన్నతాధికారులు అభినందించారు.

# ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు ..!







- అయ్యవారి బాగోతాలు -3
- వేగేశ్వరపురం టు భీమడోలు..
- భీమడోలు రిజిస్ట్రార్ ఆఫీసులో ప్రైవేట్ మహిళ పెత్తనం..
- రికార్డు రూమ్ తాళాలు ఆమె చేతిలోనే ఎందుకు?

**వేగేశ్వరపురం నుంచి భీమడోలు వరకు సదరు సబ్ రిజిస్ట్రార్ అవినీతి ప్రస్థానం అప్రతిహతంగా సాగుతోంది. సామాన్యులను పీడించడంలో, ప్రైవేట్ వ్యక్తులకు ప్రభుత్వ రికార్డులను అప్పగించడంలో ఈ 'అయ్యగారి' రూటే సెపరేటు అంటూ బాధితులు గగ్గోలు పెడుతున్నారు. తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో విధులు నిర్వహించి, ప్రస్తుతం భీమడోలులో తిష్టవేసిన సదరు అధికారి వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ బదిలీ వార్తతో పాత పాపాలు మళ్లీ పండాయి. ఆయన ఎక్కడ పనిచేస్తే అక్కడ వివాదాలు, అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడం ఇప్పుడు రిజిస్ట్రేషన్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.**

**ఈ నేపథ్యంలో 'పెన్ పవర్' అందిస్తున్న ప్రత్యేక విశ్లేషణాత్మక కథనం... ఎపిసోడ్ 5:**

- వేగేశ్వరపురంలో సామాన్యులకు చుక్కలు చూపించిన వైనం
- భీమడోలుకు మారినా మారని సబ్ రిజిస్ట్రార్ నైజం
- ప్రభుత్వ పెద్దలకు చేరిన అధికారిక అవినీతి ఫిర్యాదులు
- బినామీల పేర్లతో హైదరాబాద్, విజయవాడల్లో అక్రమాస్తుల పర్వం
- ఆఫీసులో ప్రభుత్వ సిబ్బంది డమ్మీ.. ప్రైవేట్ మహిళే సుప్రీం!
- రికార్డు రూమ్ తాళాలు ప్రైవేట్ మహిళ చేతిలోనే ఎందుకు?
- రంగ ప్రవేశం చేసిన ప్రైవేట్ 'త్రిమూర్తులు'.. అంతా వారి ఇష్టారాజ్యం
- అప్లికేషన్ 'బరువు'ను బట్టి ముందే సిద్ధమవుతున్న 'రేట్ కార్డ్'
- ఇది ప్రభుత్వ కార్యాలయమా.. లేక ప్రైవేట్ దళారుల అడ్డానా?
- శాఖా పరమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఎడిటర్ పెన్ పవర్ ఏలూరు /భీమడోలు , జూలై 20 :

గతంలో వేగేశ్వరపురం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ అధికారి పనిచేసిన కాలంలో రిజిస్ట్రేషన్ సేవల కోసం వచ్చిన సామాన్య ప్రజలు నరకం చూశారు. చిన్నపాటి పనుల కోసం కూడా రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పించుకోవడం, దరఖాస్తులను అనవసరంగా పెండింగ్‌లో పెట్టడం ఆయనకు అలవాటుగా మారిందని స్థానికులు మళ్లీ గుర్తు చేసుకుంటున్నారు. భీమడోలుకు మారినా మారని నైజం స్థాన చలనం కలిగి భీమడోలు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చినప్పటికీ సదరు అధికారి తన పంథాను మార్చుకోలేదు. పైగా ఇక్కడ అక్రమ వసూళ్లు, ప్రజలతో కఠిన ప్రవర్తన, రైతులను ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలతో మరింతగా రెచ్చిపోయారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ పెద్దలకు చేరిన అధికారిక ఫిర్యాదులు : ఈ అధికారి వేధింపులు, అవినీతి పరాకాష్టకు చేరడంతో బాధితులు ఏకంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (భూమి, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపులు) గారికి ఆధారాలతో సహా అధికారికంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఈ సబ్ రిజిస్ట్రార్ వ్యవహారం ఇప్పుడు సచివాలయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

బినామీల పేర్లతో హైదరాబాద్, విజయవాడల్లో అక్రమాస్తులు? : ఫిర్యాదుదారులు పేర్కొన్న వివరాల ప్రకారం.. ఈ సబ్ రిజిస్ట్రార్ సామాన్య ప్రజల నుంచి, రైతుల నుంచి అక్రమంగా వసూలు చేసిన సొమ్ముతో విజయవాడ, హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో తన కుటుంబ సభ్యులు, బినామీల పేరిట భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు తెలుస్తోంది. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. ఆఫీసులో ప్రభుత్వ సిబ్బంది డమ్మీ.. ప్రైవేట్ మహిళే సుప్రీం! : భీమడోలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో వింత పోకడలు సాగుతున్నాయి. ప్రభుత్వ జీతాలు తీసుకునే అధికారిక సిబ్బందిని పక్కనపెట్టి, ఒక ప్రైవేట్ మహిళకు సదరు అధికారి అసాధారణ ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజలు ముందుగా ఆమెనే కలవాలనే అలిఖిత నిబంధన అక్కడ నడుస్తోంది.

రికార్డు రూమ్ తాళాలు ప్రైవేట్ మహిళ చేతిలోనే ఎందుకు? : ఏళ్ల తరబడి అత్యంత భద్రంగా ఉండాల్సిన ప్రభుత్వ ల్యాండ్ రికార్డులు, విలువైన పత్రాలు ఉండే రికార్డు రూమ్ తాళాలు ఆ ప్రైవేట్ మహిళ ఆధీనంలో ఉండటం అత్యంత ప్రమాదకరంగా మారింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ వ్యవహారం వెనుక ఉన్న 'చిదంబర రహస్యం' ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రంగ ప్రవేశం చేసిన ప్రైవేట్ 'త్రిమూర్తులు' : ఆఫీసులో ఆ మహిళ పెత్తనం ఒకెత్తయితే.. కార్యకలాపాలను శాసించడానికి ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులు రంగంలోకి దిగారు. స్థానిక సమాచారం ప్రకారం.. "కుదిరితే శ్రీరాముడు... లేకపోతే అశోకుడు... లేదంటే రాజు..." అనే సూత్రంతో ఈ ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులే ఆఫీసులో అసలు నిర్ణయాధికారులుగా చలామణి అవుతున్నారు. అప్లికేషన్ బరువును బట్టి 'రేట్ కార్డ్' సిద్ధం : కార్యాలయానికి వచ్చే ప్రతి దరఖాస్తు స్వభావాన్ని బట్టి ఈ ప్రైవేట్ త్రిమూర్తులే ముందుగా ఒక 'రేట్ కార్డ్' సిద్ధం చేస్తారట. ఏ అప్లికేషన్‌కు ఎంత వసూలు చేయాలి, ఎవరికి ఎంత వాటా వెళ్ళాలి అనేది దరఖాస్తు 'బరువు' (ఆస్తి విలువ)ను బట్టి ముందే ఫిక్స్ చేస్తారని నమ్మదగిన సమాచారం.

ఇది ప్రభుత్వ కార్యాలయమా.. ప్రైవేట్ అడ్డానా? : ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాల్సిన ఒక ప్రభుత్వ శాఖ, కొందరు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో బందీ అయిపోవడంతో సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఫీసుకు వస్తే ప్రభుత్వ అధికారుల కంటే ఈ ప్రైవేట్ దళారుల కాళ్లు పట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారుల పారదర్శక విచారణకై డిమాండ్ : ప్రభుత్వ రికార్డుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తూ, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన భీమడోలు సబ్ రిజిస్ట్రార్ వ్యవహారంపై జిల్లా రిజిస్ట్రార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. సమగ్ర విచారణ జరిపి, నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు...

**వృద్ధుడు ఇచ్చిన ఫిర్యాదు పై... స్థానికులు ఇచ్చిన పిర్యాదులపై ఆ శాఖ అదికారులు ఎందుకు మౌనం గా ఉన్నారు.. ? నోట్ల కట్ల తో నోర్లు మూయించాడా...? నిజమేనా ..? చదువుతూనే ఉండండి పెన్ పవర్ మరిన్ని ఆధారాలతో ఎపిసోడ్ -6 లో...**

### అయోధ్య టెంపుల్ విరాళాల చోరీ సాధారణ నేరమే.. రాజకీయం చేయొద్దు

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి మందిర విరాళాల దారిమళ్లింపు కేసును రాజకీయం చేయవద్దని సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా హెచ్చరించింది. ఈ కేసులో సీబీఐ విచారణ జరిపించాలని, ట్రస్టు ఆర్థిక లావాదేవీలపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్ల విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. "ఇది కేవలం నేరపూరిత చర్యకు సంబంధించిన ఒక సాధారణ కేసు. ఈ అంశాన్ని రాజకీయం చేయవద్దని మేము హెచ్చరిస్తున్నాము" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న దర్యాప్తు పురోగతిపై సమర్పించిన నివేదికను పరిశీలించిన తర్వాత తగిన ఆదేశాలు జారీ చేస్తామని కోర్టు పేర్కొంది. భక్తులు సమర్పించిన నగదు, బంగారం, వెండి వంటి విలువైన వస్తువులను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టులోని కొందరు వ్యక్తులు దారిమళ్లించారన్న ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. యూపీ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక విచారణ అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు కేంద్ర సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరించారు. దర్యాప్తు కొనసాగుతున్నందున, మరిన్ని వివరాలను ప్రస్తుతం బహిర్గతం చేయలేమని ఆయన తెలిపారు.

ఈ కేసులో నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిగేలా సిట్‌ను పునర్వ్యవస్థీకరించే అంశంపై సూచనలు తీసుకోవాలని కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. అయితే, తప్పుడు ప్రచారాలకు ఆస్కారం ఉంటుందన్న కారణంతో ఎఫ్ఐఆర్, దర్యాప్తు నివేదికలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలన్న అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. పారదర్శకత కోసం పక్కాగా రికార్డులను నిర్వహించాలని స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. పిటిషనర్ల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ వాదనలు వినిపిస్తూ, బంగారం, వెండి వస్తువులు అదృశ్యమవుతున్నాయని, విరాళాలకు సరైన లెక్కలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణ సమయంలో భక్తులకు జారీ చేసిన రసీదులను ఒక వెబ్‌సైట్‌లో ఉంచాలని, తద్వారా దాతలు తమ విరాళాలు ట్రస్ట్‌కు చేరాయో లేదో సరిచూసుకోవచ్చని ఆయన సూచించారు. అయితే, ఈ ప్రతిపాదనను ప్రధాన న్యాయమూర్తి తోసిపుచ్చారు.

### భారతదేశ చరిత్రలోనే అత్యంత యువత వ్యతిరేక ప్రధాని మోడీనే

- మొదటి పేజి తరువాయి

చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం (జులై 20) కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా నిరసనకారులపై కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై రాహుల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా ఆందోళన తెలుపుతున్న నిరసనకారులపై లాఠీఛార్జ్, టియర్ ప్రయోగం చేయడాన్ని ఉద్దేశిస్తూ మోడీ సర్కార్?పై ఆయన ధ్వజమెత్తారు.

బీజేపీ ప్రభుత్వ హయాంలో 152 ప్రశ్నపత్రాల లీక్ కాగా.. 7.5 కోట్ల మంది విద్యార్థులు బాధితులయ్యారని అన్నారు. ఇప్పటి వరకు ఒక్క దోషికి కూడా శిక్ష పడలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కానీ కష్టపడి చదివిన యువతకు మాత్రం శిక్ష పడిందని మండిపడ్డారు. పేపర్ లీకులు, విద్యా వ్యవస్థలోని లోపాలపై ప్రశ్నించిన యువతపై లాఠీ దెబ్బలు, నిర్బంధాలు విధించారని నిప్పులు చెరిగారు.

ప్రశ్నపత్రాలను లీక్ చేసిన నేరగాళ్లు స్వేచ్ఛగా బయట తిరుగుతున్నారు. కానీ సమస్యలు లేవనెత్తిన విద్యార్థులను ఈడ్చుకెళ్లి దారుణంగా కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ సర్కార్ పేపర్ లీకులతో యువత జీవితాన్ని నాశనం చేయడమే కాకుండా.. తిరిగి వారిపైనే దాడి చేస్తోందని తూర్పారబట్టారు.

**సీజేపీ చలో పార్లమెంట్:**

నీట్ 2026 పేపర్ లీక్, విద్యా వ్యవస్థలోని అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జులై 20న చలో పార్లమెంట్ కార్యక్రమానికి క్రాకోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చింది. సీజేపీ పిలుపు మేరకు యువత పెద్ద ఎత్తున ఢిల్లీ చేరుకుని చలో పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో సీజేపీ పార్లమెంట్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అనుమతి లేదని సీజేపీ మద్దతుదారులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, సీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో సీజేపీ కార్యకర్తలు, మద్దతుదారులపై పోలీసులు విచక్షణరహితంగా లాఠీచార్జ్ చేశారు. అయినప్పటికీ యువత వెనక్కి తగ్గకుండా నిరసన కార్యక్రమాన్ని కొనసాగించింది.

సీజేపీ మద్దతుదారులు పార్లమెంట్ లోపలికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు పార్లమెంట్ గేట్స్ క్లోజ్ చేసి సీజేపీ సపోర్టర్స్ ను అదుపులోకి తీసుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పార్లమెంట్ బయట ఫైర్ బ్రిగేడ్లతో భారీగా పోలీసులను మోహరించారు. పార్లమెంట్ బయట సీజేపీ.. లోపల ప్రతిపక్షాల నిరసనలతో సోమవారం (జులై 20) దేశ రాజధాని ఢిల్లీ దద్దరిల్లింది.

### ఉక్రెయిన్‌లో కార్గో నౌకపై దాడి.. నలుగురు భారతీయులతో సహా పలువురు మృతి

- మొదటి పేజి తరువాయి

కొద్దిసేపటికే ఈ దాడికి గురైంది. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 17 మంది సిబ్బంది ఉన్నారు. సహాయక బృందాలు కొందరిని రక్షించి ఒడెస్సాలోని ఆసుపత్రికి తరలించాయి. ఈ ఘటనలో ఉక్రెయిన్ పైలట్‌తో పాటు మరికొందరు మరణించినట్లు అధికారులు వెల్లడించారు.

ఈ నౌకలో మొత్తం ఐదుగురు భారతీయులు ఉన్నట్లు భారత విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. వారిలో నలుగురు దుర్మరణం పాలవ్వగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉక్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధితులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోంది. "ఉక్రెయిన్‌లోని తాజా పరిస్థితులను తమ బృందం నిశితంగా పర్యవేక్షిస్తోందని, బాధితులకు అండగా నిలిచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని విదేశాంగ శాఖ పేర్కొంది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వ్యక్తి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. "వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం, అమాయక పౌర సిబ్బంది ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం, నౌకాయానం మరియు వాణిజ్య స్వేచ్ఛకు ఆటంకం కలిగించడం అత్యంత విచారకరం. ఇలాంటి దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కావు" అని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

### కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీతో పాటు పలు పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ఆరోపణలు వెల్లువెత్తడంతో ఢిల్లీలో నిరసనలు ఉద్ధృతమయ్యాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా ఢిల్లీలోని నడ్డా నివాసంలో సుమారు 10 నిమిషాల పాటు సమావేశమై, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సమస్యపై అంతర్గతంగా ఉన్నత స్థాయిలో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారని, అయితే ఎటువంటి నిర్దిష్ట హామీలు లభించలేదని సౌరవ్ దాస్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజే సీజేపీ 'పార్లమెంట్ ముట్టడి'కి పిలుపునివ్వడంతో జంతర్ మంతర్ వద్దకు విద్యార్థులు, యువత భారీగా చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నప్పటికీ ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు కొన్నిచోట్ల లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పవాయువును ప్రయోగించారు. సోషల్ మీడియాలో ఒక వ్యంగ్య ఉద్యమంగా ఆరంభమైన కాక్రోచ్ జనతా పార్టీ, ప్రస్తుతం పరీక్షల లీకేజీలు, సాంకేతిక వైఫల్యాలపై నిరంతరాయంగా పోరాడుతోంది. ఈ ఉద్యమానికి మద్దతుగా పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ సుదీర్ఘ నిరాహార దీక్ష చేపట్టారు. ఆందోళనలు ప్రారంభమైన తర్వాత సీజేపీ నేతలతో కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చలు జరపడం ఇదే ప్రథమం. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని సీజేపీ నాయకత్వం తేల్చిచెప్పింది.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# పంట బీమా ప్రీమియం ప్రభుత్వమే భరించాలి : సిపిఐ




**పెన్‌పవర్,ప్యాపిలి:** పంట బీమా ప్రీమియాన్ని రైతులతో చెల్లింపజేయడం దారుణమని, మొత్తం ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మండల కార్యదర్శి జె. మహేష్ డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సాగు ఖర్చులు పెరగడం, గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల రైతులు ఇప్పటికే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో పంట బీమా ప్రీమియం పేరుతో రైతులపై అదనపు భారం మోపడం ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానానికి నిదర్శనమని విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాలు, ఎల్ నినో ప్రభావం, కరువు, తెగుళ్లు, మార్కెట్‌లో మోసాల కారణంగా రైతులు భారీ నష్టాలు చవిచూస్తున్నారని పేర్కొన్నారు. పంటకు రక్షణ కల్పించాల్సిన బీమా ప్రీమియాన్ని కూడా రైతులే చెల్లించాలనడం అన్యాయమని అన్నారు. పంట బీమా ప్రభుత్వ బాధ్యతేనని, రైతులపై ఒక్క రూపాయి కూడా భారం వేయకుండా మొత్తం ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి స్థాయిలో బీమా పరిహారం చెల్లించాలని, నష్టాల అంచనాల్లో జాప్యం, అధికారుల నిర్లక్ష్యం, బీమా కంపెనీల ఇష్టారాజ్యాన్ని ప్రభుత్వం వెంటనే అరికట్టాలని కోరారు. ఎన్నికల సమయంలో రైతు సంక్షేమంపై హామీలు ఇచ్చిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను విస్మరించిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే పంట బీమా ప్రీమియాన్ని పూర్తిగా భరించేలా నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో రైతాంగాన్ని సమీకరించి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడంతో పాటు రైతు సమస్యలపై "చలో ఢిల్లీ" కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సిపిఐ హెచ్చరించింది.




# దొంగ పత్రాలతో భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతోనే భూకబ్జాలు | అఖిలపక్ష పార్టీల నాయకుల ఆరోపణ | అవిలాల భూ విభాదంపై ఆరోపణలు | పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలి

**తిరుపతి, పెన్ పవర్, జూలై 20 :** తిరుపతి అర్బన్, రూరల్ ప్రాంతాల్లో భూకబ్జాలు, భూ ఆక్రమణలు, రౌడీయిజాన్ని అరికట్టి.. దొంగ పత్రాలు సృష్టించి భూములను ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, పోలీసుల మెతక వైఖరి కారణంగానే భూకబ్జాలు పెరుగుతున్నాయని ఆరోపించారు. భూకబ్జాలు, రౌడీయిజం, భూ ఆక్రమణలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తిరుపతి పరిసర ప్రాంతాల్లో భూ ఆక్రమణలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సి ఉండగా.. కొందరు ధనార్జనే ధ్యేయంగా భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమ అక్రమాలకు అడ్డుగా నిలిచే పేదలు, భూ బాధితులను భయభ్రాంతులకు గురిచేస్తూ.. వారిపై అక్రమ కేసులు పెట్టడం ద్వారా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ, పోలీస్, సబ్‌రిజిస్ట్రార్ శాఖల్లో కొందరు అధికారులు ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను విస్మరిస్తున్నారని విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా భూ వివాదాలు పెరిగి శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు.

**అవిలాల భూ వివాదంపై ఆరోపణలు:** అవిలాల గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 476/1లో ఉన్న మూడు ఎకరాల 17 సెంట్ల భూమికి సంబంధించిన వివాదంపై అఖిలపక్ష నాయకులు తీవ్ర ఆరోపణలు చేశారు. రిటైర్డ్ ఆర్టీవో ఎన్. వనజమ్మకు చెందిన భూమిని దొంగ పత్రాలు సృష్టించి ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే భూమికి సంబంధించిన అక్రమ లావాదేవీలు జరిగాయని వారు ఆరోపించారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**బాధితురాలి ఆవేదన :** భూ బాధితురాలు ఎన్. వనజమ్మ మాట్లాడుతూ.. తనకు 75 సంవత్సరాల వయస్సు ఉన్నప్పటికీ భూమిని కాపాడుకునేందుకు రోడ్డుపైకి రావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దొంగ పత్రాలు సృష్టించిన వ్యక్తులకు అనుకూలంగా భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. భూమిని కాపాడుకునేందుకు వయస్సు రీత్యా తిరగలేకపోతున్నానని, తన కుటుంబానికి కూడా ప్రాణహాని ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని భూమిని కాపాడడంతో పాటు తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.

**పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలి :** భూకబ్జాలు, రౌడీయిజానికి పాల్పడుతున్న వారిపై తక్షణమే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. నిజమైన భూ బాధితులకు అండగా నిలిచి.. భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తిరుపతి అర్బన్, రూరల్ ప్రాంతాలకు ఆర్డీవో స్థాయి అధికారులను నియమించాలని కోరారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్వోకు అఖిలపక్ష నాయకులు వినతిపత్రం సమర్పించారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఆర్వో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ. రామానాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి. మురళి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు పి. అంజయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాగంటి గోపాల్‌రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు నగేష్, సీపీఐ నగర కార్యదర్శి జిల్లా విశ్వనాథ్, కే. రాధాకృష్ణ, గురవయ్య, ఎన్. చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్.డి. రవి, పద్మనాభరెడ్డి, రత్నమ్మ, మహేంద్ర, శ్రీరాములు, ఎం. రామకృష్ణ, ఏపీ బాల, వెంకటేష్, సురేష్, విజయమ్మ, ప్రమీల, రాము, మునీశ్వర్, కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యాచారయత్నం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

మహిళపై అత్యాచారయత్నం కేసులో ఇద్దరికి మూడున్నరేళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ స్థానిక ఆరో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి హరిత సోమవారం తీర్పు ఇచ్చారు. ఏపీపీ బాలాజీ వివరాల మేరకు.. తిరుపతికి చెందిన అనుకుట్టి వెంకటేష్ అలియాస్ కుక్కలోడు కొబ్బరికాయల వ్యాపారం చేస్తారు. టీఎస్ శశికుమార్ అలియాస్ కుమార్‌రాజా ఆటో చోదకుడు. వీరిద్దరూ స్నేహితులు. తిరుపతికి చెందిన ఓ మహిళ 2017 మే 27 రాత్రి 9 గంటలకు ఇంటికి వెళ్లేందుకు రుయా ఆసుపత్రి వద్ద వేచి ఉన్నారు. వెంకటేష్, శశికుమార్ ఉన్న ఆటో ఆమె ఎక్కారు. ఇస్కాన్ టెంపుల్ వద్దకు తీసుకెళ్లి.. హత్య చేస్తామని బెదిరించి దుర్భాషలాడి అత్యాచార యత్నానికి పాల్పడ్డారు. ఆమె తప్పించుకుని పారిపోయి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరు పరచగా.. పూర్వాపరాల పరిశీలన అనంతరం నేరం రుజువు కావడంతో ఇద్దరికీ మూడున్నరేళ్ల చొప్పున జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

## 18 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


తిరుపతి అన్నమయ్యసర్కిల్: అన్నమయ్య జిల్లా, పీలేరు రోడ్డు మార్గంలో, గుడిపాల -- రాణీపేట హైవేలో రెండు చోట్ల కారులో తరలిస్తున్న 18 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారు అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహనాలను సీజ్ చేశారు. ఏఆర్‌ఎస్‌ఐ కె.మహేశ్వరనాయుడు బృందం స్థానిక అటవీ సిబ్బంది జగదీష్, ఆషాబీతో కలసి అన్నమయ్య జిల్లా కేవీ పల్లి--పీలేరు మార్గంలో పొంతల చెరువు క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున ఒక కారు వేగంగా వస్తూ టాస్క్‌ఫోర్స్ బృందాన్ని గమనించి కారును ఆపి అందులోని వ్యక్తులు దిగి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని వెంబడించి ఇద్దరినీ పట్టుకోవడంలో మరో వ్యక్తి పారిపోయాడు. వారిద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా తమిళనాడు తిరుపత్తూరు, తిరువణ్ణామలై జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు. 11 ఎర్రచందనం దుంగలు, కారుతో సహా పట్టుబడిన వారిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వారిని డీఎస్పీ వీ.శ్రీనివాసులు రెడ్డి, ఏసీఎఫ్ జె. శ్రీనివాస్ విచారించారు. ఈ కేసును సీఐ ఖాదర్ బాషా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# గ్రీవెన్స్‌కు అధికారుల జంప్

### సూళ్లూరుపేటలో నీరుగారుతున్న 'ప్రజా వేదిక'!
### 11:45 దాటినా కార్యాలయానికి రాని సిబ్బంది, అధికారులు
### గంటల తరబడి బాధితుల నిరీక్షణ
### ప్రభుత్వ ఆదేశాలకే తూట్లు పొడుస్తున్న నిర్లక్ష్యం
### ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్





**సూళ్లూరుపేట, పెన్ పవర్, జూలై 20:** ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి, వాటికి అక్కడికక్కడే సత్వర పరిష్కారం చూపాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సూళ్లూరుపేట మండల స్థాయి అధికారులు తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారు. అధికారుల అలసత్వం మరియు బాధ్యతారాహిత్యంతో సోమవారం నాటి కార్యక్రమం పూర్తిగా ప్రశ్నార్థకంగా మారింది.

**గంటల తరబడి బాధితుల నరకయాతన :** సుదూర ప్రాంతాల నుండి ఎన్నో ఆశలతో వినతిపత్రాలు చేతపట్టుకుని ఉదయమే సూళ్లూరుపేట కార్యాలయానికి చేరుకున్న బాధితులకు తీవ్ర నిరాశే ఎదురైంది. నిర్ణీత సమయం దాటి, ఉదయం 11:45 గంటలు కావస్తున్నా సంబంధిత అధికారులు విధులకు హాజరు కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ వివాదాలు, పట్టాదారు పాస్‌బుక్కులు, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు మరియు ఇతర అత్యవసర రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, రైతులు కార్యాలయ ప్రాంగణంలోనే గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది.

**నీరుగారుతున్న ప్రభుత్వ ఆశయాలు:** పాలనను ప్రజల ముంగిటకే తీసుకెళ్లాలని ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన రోజునే అధికారులు సమయపాలన పాటించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "ప్రతి సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని ప్రభుత్వం కఠిన ఆదేశాలు ఇస్తున్నా.. సూళ్లూరుపేటలో మాత్రం సమాధానం చెప్పే నాథుడే కరువయ్యాడు" అని దూర ప్రాంతాల నుండి ప్రయాణ ఖర్చులు భరించి వచ్చిన బాధితులు వాపోతున్నారు. సమయపాలన, బాధ్యతాయుతమైన విధి నిర్వహణలో ఘోరంగా విఫలమవుతూ.. ప్రభుత్వంపై ప్రజల్లో ప్రతికూల భావన కలిగేలా వ్యవహరిస్తున్న అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని సూళ్లూరుపేట ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా అధికారులు సమయానికి హాజరై వినతులు

# నందలూరులో నేటి నుంచి శ్రీ సౌమ్యనాథ స్వామివారి బ్రహ్మోత్సవాలు

### 22న ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభం.. భక్తుల కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు



**నందలూరు, పెన్‌పవర్, జూలై 20:** కడప జిల్లా నందలూరులోని ప్రాచీన, ప్రసిద్ధ శ్రీ సౌమ్యనాథ స్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరగనుంది. జూలై 21న సాయంత్రం 6 గంటలకు మేదినీపూజ, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. జూలై 22న ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమవుతాయి. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ దీపాలంకరణలు, రంగవల్లులు ఏర్పాటు చేశారు.

**ప్రతిరోజూ దివ్య వాహనసేవలు :** బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు స్వామివారు వివిధ దివ్య వాహనాలపై ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. జూలై 22న ఉదయం ధ్వజారోహణం, రాత్రి యాలి వాహనసేవ నిర్వహిస్తారు. 23న ఉదయం పల్లకీ సేవ, రాత్రి హంస వాహనం; 24న ఉదయం పల్లకీ సేవ, రాత్రి సింహ వాహనసేవ ఉంటుంది. జూలై 25న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహనం; 26న ఉదయం శేష వాహనం, రాత్రి గరుడ వాహనసేవ నిర్వహించనున్నారు. 27న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం ఉంటుంది.

**28న ఆర్జిత కల్యాణోత్సవం:** జూలై 28న ఉదయం 10 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. గృహస్థ దంపతులు రూ.500 చెల్లించి ఈ సేవలో పాల్గొనవచ్చు. పాల్గొనే ప్రతి దంపతులకు ఒక ఉత్తరీయం, ఒక రవికెతో పాటు అన్నప్రసాదాలను టీటీడీ అందించనుంది. అదే రోజు రాత్రి గజ వాహనసేవ నిర్వహిస్తారు. జూలై 29న ఉదయం 9 గంటలకు రథోత్సవం, రాత్రి అశ్వ వాహనసేవ ఉంటుంది. జూలై 30న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం నిర్వహించనున్నారు. జూలై 31న సాయంత్రం 6 గంటలకు పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

భక్తి సంగీతం, హరికథలు : బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంగీతం, హరికథలు, సంకీర్తనలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# మెట్లపై నుంచి జారిపడి యువకుడి మృతి

తిరుపతి రూరల్: మద్యం మత్తులో మెట్లపై నుంచి జారి కిందపడిన యువకుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగేశ్వర్ నగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీకాళహస్తికి చెందిన భాస్కర్ (28) తిరుపతిలోని ఆంధ్ర బ్యాంకు కాలనీలో టెన్నిస్ అసిస్టెంట్ కోచ్‌గా పనిచేస్తున్నాడు. లింగేశ్వర్ నగర్‌లోని ఓ ఇంట్లో స్నేహితుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. స్నేహితుడు తన స్వగ్రామానికి వెళ్లడంతో భాస్కర్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. ఈ క్రమంలో మద్యం సేవించిన భాస్కర్ మొదటి అంతస్తు నుంచి మెట్లపై దిగుతుండగా అదుపుతప్పి బోర్లా పడిపోయాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు తల్లి ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తిరుపతి రూరల్ సీఐ మద్దయ్యాచారి తెలిపారు.

# జీవో నెంబర్ 396 నో వెంటనే రద్దు చేయాలి

## నాయుడుపేటలో ప్రారంభమైన దస్తావేజు లేఖరుల నిరవధిక సమ్మె

## నాయుడుపేట దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం



**నాయుడుపేట, పెన్ పవర్, జూలై 20 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉమ్మడి కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పి 3 విధానంలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 396 ను వెంటనే రద్దు చేయాలని,దస్తావేజు లేఖరుల జీవనోపాధిని కాపాడాలని నాయుడుపేట దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరవధిక సమ్మె ప్రారంభించారు. నేటి నుండి జూలై 31వ తేదీ వరకు పెన్ డౌన్ కార్యక్రమం కొనసాగుతుందని వారు తెలిపారు.ఈనెల 20వ తేదీ నుండి 31 వరకు చేస్తున్న పెన్ డౌన్ కార్యక్రమాన్ని అన్ని రాజకీయ పార్టీలు,రియల్ ఎస్టేట్ వ్యాపారులు,ప్రజా సంఘాలు,న్యాయవాదులు, బ్యాంక్ ఏజెంట్లు,అన్ని వర్గాల ప్రజలు ఈ పెన్ డౌన్ కార్యక్రమానికి మద్దతు తెలపాలని నాయుడుపేట దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం నాయకులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నాయుడుపేట దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు కాళహస్తి శ్రీనివాసులు,కె భాస్కర్,సిహెచ్ సుమన్,కె గోపి,షేక్ అజీజ్, జి సుమన్,జి విజయభాస్కర్, డి ఉదయ్ కుమార్ రెడ్డి, సిహెచ్ అశోక్,సిహెచ్ గోపి,పి శ్రీనివాసులు,పి మల్లికార్జునరావు,దస్తావేజు లేఖరుల సహాయకులు పాల్గొన్నారు.

# జీవో 396 రద్దు చేయాలి

## తొట్టంబేడులో దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్ ఉద్యమం ప్రారంభం



**తొట్టంబేడు, పెన్ పవర్, జూలై 20 :** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం పిలుపు మేరకు తొట్టంబేడులో దస్తావేజు లేఖరులు సోమవారం పెన్‌డౌన్ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకు 12 రోజుల పాటు నిరసన కొనసాగుతుందని వారు తెలిపారు. దస్తావేజుల తయారీ ప్రక్రియను ప్రైవేట్ సేవా కేంద్రాలకు అప్పగించడం వల్ల ప్రజల ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది దస్తావేజు లేఖరుల జీవనోపాధి ప్రమాదంలో పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై పునరాలోచించి జీవో నెం.396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దస్తావేజు లేఖరుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. ప్రజలు, దస్తావేజు లేఖరులు తమ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు.

# మూడు ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



**పలమనేరు,పెన్ పవర్, జులై 20:** మూడు ద్విచక్ర వాహనాల దొంగను పలమనేరు పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ దేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో పలమనేరు ఇన్స్పెక్టర్ సి.ఐ.మోహన్ రెడ్డి మరియు సబ్ ఇన్స్పెక్టర్ లోకేష్ రెడ్డి మరియు సిబ్బంది కలసి సోమవారం ద్విచక్రవాహనాలను దొంగతనం చేసిన నిందితున్ని పట్టణానికి సమీపం నాగమంగళం ఫ్లైఓవర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా బైరెడ్డిపల్లె మండలానికి చెందిన వరదరాజు బజాజ్ వాహనంపై వస్తూ వుండగా అతనిని పట్టుకొని విచారించగా ఈ వాహనంతో బాటు ఇంకా రెండు మోటార్ సైకిల్ లను కూడా దొంగతనం చేసినట్లుగా నిందితుడు ఒప్పుకొన్నాడని పోలీసులు తెలిపారు.కాగా ముద్దాయిని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి మొత్తం 3మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకొని ముద్దాయిని రిమాండ్ కు పంపామని సి.ఐ. మోహన్ రెడ్డి అన్నారు.ప్రజలు తమ ద్విచక్ర వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో పార్క్ చేయడంతో పాటు తప్పనిసరిగా హ్యాండిల్ లాక్ మరియు అదనపు సెక్యూరిటీ లాక్లను ఉపయోగించాలని పోలీసులు సూచించారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను భద్రంగా ఉంచుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు లేదా అత్యవసర సేవ 112కు సమాచారం అందించాలని కోరారు.చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తారని, ప్రజలు పోలీసులకు సహకరించి నేరాల నివారణలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆసుపత్రి కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలి

## జూలై 25న టీటీడీ పరిపాలన భవనం వద్ద ధర్నా విజయవంతం చేయాలి: సీఐటీయూ



**తిరుపతి, పెన్ పవర్ జూలై 20:** స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు కే. వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం జూలై 25న టీటీడీ పరిపాలన భవనం వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై 1 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న కనీస వేతనాల ప్రచార కార్యక్రమంలో భాగంగా స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కే. వేణుగోపాల్ మాట్లాడుతూ.. స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద ఆసుపత్రుల్లోని 48 విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సేవలందిస్తున్నప్పటికీ వారికి కనీస వేతనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో రోగులకు సేవలందించడంతో పాటు పరిశుభ్రత, భద్రత, రోగుల సంరక్షణ వంటి కీలక బాధ్యతలను కార్మికులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, ఇళ్ల అద్దెలు, పిల్లల విద్య, వైద్య ఖర్చుల నేపథ్యంలో ప్రస్తుతం అందుతున్న వేతనాలు కుటుంబ పోషణకు సరిపోవడం లేదని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సొసైటీ కార్మికుడికి నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా టీటీడీ పరిధిలోని స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని, టీటీడీ యాజమాన్యాన్ని కోరారు. డిమాండ్ల సాధన కోసం జూలై 25న టీటీడీ పరిపాలన భవనం వద్ద నిర్వహించనున్న ధర్నాలో కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ కార్మికుల సంఘం అధ్యక్షుడు వి. సూరితో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# బ్యాంక్ అధికారుల తీరుపై బాధితుడి ఆరోపణలు

## డి ఆర్ టి లో కేసు పెండింగ్‌లో ఉండగానే ఆస్తి స్వాధీనం చేసుకున్నారని వాదన



**గూడూరు, పెన్ పవర్, జూలై,20 :** వ్యాపార అవసరాల నిమిత్తం తీసుకున్న బ్యాంకు రుణం విషయంలో న్యాయపరమైన విచారణ కొనసాగుతుండగానే బ్యాంక్ అధికారులు చట్టవిరుద్ధంగా వ్యవహరించారని బాధితుడు వంశీధర్ రెడ్డి ఆరోపించారు. వంశీధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, 2018 అక్టోబర్ 5న గూడూరులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ నుంచి రూ.43 లక్షల వ్యాపార రుణం పొందారు. ఆ రుణానికి హామీగా మూడు ఆస్తులను తనఖాగా ఉంచినట్లు తెలిపారు. అనంతరం కరోనా పరిస్థితుల ప్రభావంతో వ్యాపారంలో తీవ్ర నష్టాలు రావడంతో 2023 నుంచి రుణాన్ని సకాలంలో చెల్లించలేకపోయామని, దీంతో బ్యాంకు ఆ ఖాతాను నాన్-పర్ఫార్మింగ్ అసెట్ (ఎన్‌పీఏ)గా ప్రకటించిందని పేర్కొన్నారు. రుణ బకాయిల వసూళ్ల కోసం బ్యాంకు అధికారులు తనఖా ఆస్తులను మూడు సార్లు వేలం వేయడానికి ప్రయత్నించారని, మొదటి రెండు సందర్భాల్లో బ్యాంకు నిర్లక్ష్యం కారణంగా వేలం ప్రక్రియ పూర్తి కాలేదని ఆరోపించారు. మూడోసారి మాత్రం చట్టబద్ధమైన విధానాన్ని అనుసరించకుండా వేలం నిర్వహించారని తెలిపారు. దీనిపై తాము డెట్ రికవరీ ట్రిబ్యునల్ (డి ఆర్ టి)ను ఆశ్రయించి కేసు దాఖలు చేశామని, కోర్టు నోటీసులు జారీ చేసినప్పటికీ బ్యాంకు అధికారులు సమాధానం ఇవ్వకుండా వేలం ప్రక్రియ కొనసాగించారని ఆరోపించారు. అలాగే ఆస్తి ఉన్న ప్రదేశంలో నోటీసు ప్రదర్శించకుండా నిబంధనలకు విరుద్ధంగా వేలం నిర్వహించారని పేర్కొన్నారు. అదేవిధంగా డి ఆర్ టి ఎదుట పలుమార్లు వాయిదాలు కోరుతూ నకిలీ స్టాంపులు సమర్పించారని, అనంతరం సరైన ఆధారాలు సమర్పించేందుకు ట్రిబ్యునల్ గడువు ఇచ్చిందని తెలిపారు. అయితే ఆ గడువు ముగియకముందే బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏఆర్బీ హైదరాబాద్‌కు చెందిన అధీకృత అధికారి దౌర్జన్యంగా ఆస్తిని ఖాళీ చేయించి స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. కోర్టు విచారణ కొనసాగుతున్న సమయంలోనే చట్టవిరుద్ధంగా జరిగిన చర్యలను చట్టబద్ధంగా చూపించే ప్రయత్నం జరుగుతోందని వంశీధర్ రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంలో సాక్ష్యంగా ఉన్న వ్యక్తి కూడా స్పందించడం లేదని తెలిపారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని వంశీధర్ రెడ్డి కోరారు.

# అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ

## 504 కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు : ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్





**గూడూరు, పెన్ పవర్,జూలై 20:** కోట మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కోట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ హాజరై అంగన్వాడీ సిబ్బందికి ఇండక్షన్ స్టవ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంగన్వాడీ వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. గూడూరు నియోజకవర్గంలోని సుమారు 504 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లను అందిస్తున్నామని తెలిపారు. ఇంధన పొదుపు కార్యక్రమంలో భాగంగానే ప్రభుత్వం ఈ స్టవ్‌లను అందజేస్తోందని, వాటి వినియోగానికి అయ్యే నెలకు రూ.500 వరకు విద్యుత్ బిల్లును కూడా ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గూడూరు నియోజకవర్గంలో 42 అంగన్వాడీ పోస్టులను భర్తీ చేశామని ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తించి, ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నా జీవితం నా కుమారుడు జీవితం రోడ్డుపాలు చేశాడు





**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జులై 20:** ఎస్ ఐ అని చెప్పి మోసం చేసి 2017 లో పెళ్లి చేసుకుని, తీరా కుమారుడు పుట్టిన తర్వాత తమపై మొహం చాటేసి బుచ్చి కి చెందిన రసూల్ బాషా అనే వ్యక్తి రోడ్డు పాలు చేశారని భార్య ఆఫ్రిన్ ఆరోపించారు. బుచ్చి లో ఆమె మీడియాతో మాట్లాడి ఆవేదన వ్యక్తం చేశారు. విడాకుల కోసం వారు నోటీసు పంపిస్తే నెల్లూరు ఫ్యామిలీ కోర్టు లో కేసు నడుస్తున్నప్పుడే 2023 నుంచి భరణం ఇవ్వాలని కోర్టు ఆదేశించిందన్నారు. కేవలం మూడు నెలలు మాత్రమే భరణం ఇచ్చి తమను ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. 2025లో ఆగస్టులో కోర్టు లో విడాకుల కోసం డిస్మిస్ చేసి ఇరువురు కలిసి జీవనం సాగించాలని ఆదేశించినప్పటికీ జీవనానికి తీసుకెళ్లకుండా రెండో పెళ్లి చేసుకున్నాడని వాపోయారు. తమ వద్ద అధిక మొత్తంలో కట్నం డబ్బులు తీసుకుని తమను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. టిడిపి నాయకులు అండదండలతో తమపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. వారి నుండి తమకు ప్రాణహాని ఉందని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా ఎస్పీ,ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. కోర్టు ఆదేశించిన భరణం ఇప్పించి తాము పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నం డబ్బులు, ఫర్నిచర్ తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

# కళాశాలలో ఉచిత రక్త పరీక్షలు



**పెన్ పవర్,ప్యాపిలి :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత రక్త (బ్లడ్ గ్రూప్) పరీక్షా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 90 మంది విద్యార్థులకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ రక్త వర్గాన్ని తప్పనిసరిగా తెలుసుకొని ఉండాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైనప్పుడు రక్త వర్గం తెలిసి ఉండటం వల్ల సమయానికి చికిత్స అందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు రక్తదానంపై అవగాహన పెంపొందించుకుని, భవిష్యత్తులో స్వచ్ఛంద రక్తదాతలుగా సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వెంకటేశ్వర ల్యాబ్ టెక్నీషియన్లు కమల్, నాగసాయి విద్యార్థులకు రక్త వర్గ పరీక్షలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన పాటి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అనంతలక్ష్మి, ముస్తాక్, వెంకటరమణ, ఓబులేసు, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, మురళి మోహన్, శంకరయ్య, సురేష్, మంజునాథ్, వన్నూర్‌తో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# మదర్ థెరిసా ఇంటర్ విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు



**పలమనేరు, పెన్ పవర్,జులై 20 :** గంగవరం మండలం లోని మదర్ థెరిసా జూనియర్ కళాశాల విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్నారని కళాశాల కరెస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు.రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాదించిన విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించిన అవార్డులను ఈ మేరకు సోమవారం చిత్తూరు జిల్లా కేంద్రంలో జిల్లా అధికారులు,ఎమ్మెల్యే లు మరియు ప్రముఖుల చేతుల మీద 7మంది కళాశాల విద్యార్థులు అందుకున్నారు.ఇందులో ఎంపీసీ గ్రూపుకు చెందిన అర్షియా, పావనిశ్రీ,ఎమ్.ఈ.సి గ్రూపుకు చెందిన కీర్తిన,సైదానిమ్రా, చరణ్ తేజ్, సి.ఈ.సి.గ్రూపు కు చెందిన హుస్సేన్, గురుచరణ్ లను కళాశాల కరెస్పాండెంట్ తో బాటు చైర్మన్ సునీల్,డైరెక్టర్ రాజేంద్రరెడ్డి,ప్రిన్సిపల్ దివాకర్ రెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ జైపాల్ రెడ్డి మరియు అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

# గుండుగల్లు విద్యార్థులకు 'షైనింగ్ స్టార్' అవార్డులు



**పలమనేరు,పెన్ పవర్,జులై 20:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుండుగల్లు విద్యార్థులు అద్భుతమైన ప్రతిభతో పాఠశాల కీర్తిని దశదిశలా చాటారు. 2026 విద్యా సంవత్సరానికి గానూ ప్రతిష్టాత్మక షైనింగ్ స్టార్ అవార్డ్స్ కు ఈపాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన జి.పవిత్ర(585 మార్కులు) పలమనేరు నియోజకవర్గ స్థాయి టాపర్‌గా నిలవడమే కాకుండా,మండల టాపర్‌గా కూడా నిలిచి డబుల్ అచీవ్‌మెంట్‌తో అదరగొట్టింది.అలాగే, ఇదే పాఠశాలకు చెందిన మరో విద్యార్థి తేజ(563 మార్కులు) కూడా తన అంకితభావం,కష్టపడే తత్వంతో ఈ విశిష్ట అవార్డును చిత్తూరు జడ్పీ మీటింగ్ హాల్లో జరిగినటువంటి సమావేశంలో కలెక్టర్ చేతుల మీదుగా నీ అవార్డును అందుకున్నారు. విద్యార్థులు సాధించిన ఈ ఘనతపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.విద్యార్థుల కఠోర శ్రమ,పట్టుదలే వారిని ఈ స్థాయికి చేర్చాయని,భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు ప్రత్యేక అభినందలు తెలిపారు.

# డాక్యుమెంట్ రైటర్స్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జూలై 20:** బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో రాష్ట్ర డాక్యుమెంట్ రైటర్స్ సంఘం ఆధ్వర్యంలో పెండౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎం.వి శేషయ్య మాట్లాడుతూ.. డాక్యుమెంట్ రైటర్స్ వ్యవస్థను రద్దుచేసి తమ పొట్ట కొట్టొద్దని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ వ్యవస్థను సాఫ్ట్వేర్ కంపెనీకి అప్పజెప్పడం సరికాదన్నారు. 50 మంది వరకు డాక్యుమెంట్ రైటర్స్ జీవన ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.వారికి ఉపాధిని దూరం చేసి ప్రైవేటు వాళ్లకు అప్పగించడం ఏమిటి అని ప్రశ్నించారు.ఈ నెల 31 వరకు పెన్డౌన్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

# వేద స్కూల్లో ఘనంగా అంతర్జాతీయ చదరంగ దినోత్సవం



**చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 20:** పట్టణంలోని వేద స్కూల్లో సోమవారం (జూలై 20) అంతర్జాతీయ చదరంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చదరంగ పోటీలను నిర్వహించారు. పోటీల్లో కే. సురేష్ పాల్, ఎస్.కే. సుల్తాన్ షరీఫ్, ఎం. షణ్ముఖ్, షేక్ అబ్దుల్ కరీం, షేక్ ఫరూక్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డేవిడ్ స్నేహల్ మాట్లాడుతూ, చదరంగం విద్యార్థుల మేధస్సును పెంపొందించి అత్యున్నత స్థాయికి చేరుకునేలా చేస్తుందని అన్నారు. సీఈఓ శామ్యూల్ రాజ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం తల్లిదండ్రులు, విద్యాసంస్థల బాధ్యత అని పేర్కొన్నారు. నేటి రోజుల్లో క్రీడలకు ప్రాధాన్యం తగ్గుతున్న నేపథ్యంలో విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. చదరంగం మానసిక ఉల్లాసాన్ని పెంచడంతో పాటు ఆలోచనా విధానాన్ని మెరుగుపరుస్తుందని, నేటి పోటీ ప్రపంచంలో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఎంతో అవసరమని తెలిపారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. ప్రతి సంవత్సరం జూలై 20న అంతర్జాతీయ చదరంగ దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని, చదరంగ పోటీలను క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో నిర్వహిస్తారని వివరించారు. భారతదేశానికి చెందిన అర్జున్ ఎరిగైసి, డి. గుకేష్, విశ్వనాథన్ ఆనంద్, కోనేరు హంపి, హారిక ద్రోణవల్లి వంటి ప్రముఖులు ప్రపంచ స్థాయిలో దేశానికి గుర్తింపు తీసుకువచ్చారని, ప్రస్తుతం భారతదేశంలో 98 మందికి పైగా గ్రాండ్‌మాస్టర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సీఈఓ శామ్యూల్ రాజ్, అకాడెమిక్ డైరెక్టర్ డాక్టర్ సత్య దీప్తి, పీఈటీ మనోహర్, గణితశాస్త్ర ఉపాధ్యాయుడు భాస్కర్‌తో పాటు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగుల పంపిణీ





**చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 20 :** స్థానిక సుభాని నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆసరాగా నిలుస్తూ ఉచితంగా విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. పేటలోని 'అసిస్ట్' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో, హైదరాబాద్‌కు చెందిన 'కే ఎన్ ఎ' సంస్థ సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాని నగర్‌లోని ప్రభుత్వ స్కూల్స్‌లో చదువుతున్న సుమారు 150 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ అధినేత డాక్టర్ జె. రంగారావు, కే ఎన్ ఎ సంస్థ ప్రతినిధులు ఆస్మా, భవాని, రీటా, నిఖితలతో పాటు అసిస్ట్ అసోసియేట్ డైరెక్టర్ ఎం. విష్ణుప్రియ, కోఆర్డినేటర్లు రేవతి, అమీరున్, మేలుకొలుపు సిబ్బంది మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పంపిణీ చేసిన దాతలకు, నిర్వాహకులకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇద్దరు విద్యార్థులకు ఎమ్మెల్యే నసీర్ ఆర్థిక సహకారం







**గుంటూరు, పెన్ పవర్, జులై, 20:** విద్యార్థులు సంప్రదాయ కోర్సులు కాకుండా ఇన్నోవేషన్ గా ఆలోచిస్తే సెన్సేషన్ క్రియేట్ చేయొచ్చని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. 10వ తరగతి, ఇంటర్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్థానిక ఏఎస్ కన్వెన్షన్ లో షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ శ్రీకాంత్ వర్మ, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులుతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ లో యువత బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసేందుకు ముఖ్య నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు కేవలం పుస్తకాలలో పాఠాలను బోధించడమే కాకుండా ఇన్నోవేషన్, సాంకేతిక నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ మోడల్ గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు..దీంతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ కు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను ఒడిసి పట్టుకోవాలన్నారు. పారిశ్రామికవేత్తలుగా ఎదిగి పది మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన 170 మంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఇద్దరు విద్యార్థులకు ఎమ్మెల్యే నసీర్ ఆర్థిక సహకారంవిభిన్న కోర్సులు ఎంచుకున్న ఇద్దరు విద్యార్థులకు ఎమ్మెల్యే నసీర్ ఆర్థిక సహకారం అందించారు. ఆర్కియాలజీ, మెడిసిన్ రీసెర్చ్ విభాగాల్లో వారు వివిధ కోర్సులు ఎంచుకోవటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రతిభకు పట్టం కట్టిన ప్రభుత్వం.. ధీరజ్‌కు రాష్ట్ర స్థాయి గౌరవం

## పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చీరాల నారాయణ స్కూల్ విద్యార్థికి రూ.20 వేల నగదు ప్రోత్సాహకం



**చీరాల, పెన్ పవర్, జూలై 20 :** పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చీరాల నారాయణ స్కూల్ విద్యార్థి టి. ధీరజ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ప్రభుత్వం రూ.20 వేల నగదు ప్రోత్సాహకంతో పాటు ఇతర ప్రోత్సాహకాలను అందజేసింది. బాపట్లలోని ఎన్. కన్వెన్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ చేతుల మీదుగా ధీరజ్ తన తల్లిదండ్రుల సమక్షంలో అవార్డును అందుకున్నాడు. ఈ సందర్భంగా నారాయణ స్కూల్ యాజమాన్యం విద్యార్థి ధీరజ్‌ను అభినందించింది. పాఠశాల డైరెక్టర్ సి.పి. రామకృష్ణ శర్మ, ప్రిన్సిపాల్ నిరుపమ, ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ ధీరజ్ సాధించిన విజయం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. ధీరజ్ తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ కుమారుడి విజయానికి వారి ప్రోత్సాహం, మార్గదర్శకత్వమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రభుత్వం ఈ విధంగా ప్రోత్సహించడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు ఉన్నత లక్ష్యాల సాధనకు మరింత ఉత్సాహం కలుగుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# చికిత్స పొందుతున్న విద్యార్థి తల్లికి రూ.25 వేల ఆర్థిక సాయం

## ప్రధానోపాధ్యాయురాలు బాలనాగమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల మానవతా స్పందన





**గూడూరు, పెన్ పవర్,జూలై 20 :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు మున్సిపల్ పరిధిలోని చెన్నూరు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి గొట్టిముక్కల శ్రీను తల్లి గొట్టిముక్కల లక్ష్మికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. గత జూన్ 24న మనుబోలు జాతీయ రహదారిపై జరిగిన ఆటో ప్రమాదంలో గొట్టిముక్కల లక్ష్మి తీవ్రంగా గాయపడి ఒక చేయి పూర్తిగా కోల్పోగా, మరో చేతికి రెండు వేళ్లు తెగిపోయాయి. ప్రస్తుతం ఆమె నెల్లూరులో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బాలనాగమ్మ పాఠశాల అసెంబ్లీలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు వివరించగా, అందరూ వెంటనే స్పందించి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించారు. మొత్తం రూ.25 వేల నగదును వైద్య ఖర్చుల నిమిత్తం బాధితురాలు గొట్టిముక్కల లక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు బాలనాగమ్మ మాట్లాడుతూ, కష్టకాలంలో తోటి విద్యార్థి కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు చూపిన మానవత్వం అభినందనీయమని పేర్కొన్నారు. బాధితురాలు త్వరగా కోలుకుని ఆరోగ్యంగా తిరిగి కుటుంబంతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మూగ జీవాలకు ప్రత్యేక చికిత్స

చంద్రగిరి: అంతుపట్టని వ్యాధితో గత కొద్ది రోజులుగా మృత్యువాత పడుతున్న గొర్రెలు, మేకలకు పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రత్యేక చికిత్సను అందజేశారు. సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'అకాల మరణం.. తల్లడిల్లుతున్న ప్రాణం' అన్న శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన చంద్రగిరి ఏడీ ప్రసాద్, కల్‌రోడ్డుపల్లి పశువైద్యాధికారిణి మోనిక యాదవ్‌లు తొండవాడ, శానంబట్ల గ్రామాల్లో పర్యటించారు. ఇటీవల మృతి చెందిన జీవాలకు తిరుపతి వెటర్నరీలో పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత అది చిటుక వ్యాధిగా గుర్తించినట్లు వారు తెలిపారు. అనంతరం వాటికి ఈటీ, టీటీ టీకాలను కూడా అందజేసినట్లు తెలిపారు. టీకాలు వేసిన 15 రోజుల తర్వాత రోగ నిరోధక శక్తి వస్తుందని, అప్పటి వరకు జీవాలకు లేతగడ్డి పెట్టకూడదని చెప్పారు. అలాగే ప్రతి రోజూ పొటాషియం పర్మాంగనేట్ అనే ద్రవణాన్ని తాపించాలని, తర్వాత 15 రోజులకు ఈటీ బూస్టర్ టీకాలను అందజేస్తామని తెలిపారు. తొండవాడ, శానంబట్లలోని సుమారు 950 జీవాలకు ఈ టీకాలను అందజేసినట్లు వెల్లడించారు. రైతులు కూడా చిటుకు వ్యాధిపై అవగాహన పెంచుకుని, జీవాలను పరిరక్షించుకోవాలని సూచించారు.

# ఫోన్ లేకున్నా ప్రసాదం

శ్రీకాళహస్తి: మొబైల్ ఫోన్ లేకపోయినా శివయ్య ప్రసాదం పొందేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల 'ఫోన్ లేకుంటే శివప్రసాదం లేనట్టే' శీర్షికన 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. దీనిపై దేవదాయశాఖ స్పందించింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆఫ్‌లైన్‌లో కూడా ప్రసాదం దొరికేలా కౌంటర్ ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించిన ఆర్డరు కాపీని ఈవో వెంకటేశ్వర్లు, ఆలయ చైర్మన్ కొట్టేసాయి సోమవారం విడుదల చేశారు.

# బాలిక అదృశ్యం

పోరుమామిళ్ల: మండలంలోని పుల్లివీడుకు చెందిన పడమటి హాజీరా(17) ఈ నెల 16న సాయంత్రం ఇంటి నుండి వెళ్లిపోయింది. ఎవరికీ చెప్పకుండా వెళ్లిందని, మూడు రోజులైన ఆచూకీ లభించలేదని బాలిక తండ్రి మహబూబ్‌బాషా ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు సోమవారం తెలిపారు.

# రేషన్ బియ్యం స్వాధీనం

సిద్దవటం : మండలంలోని మాచుపల్లి దర్గా సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ హారిక తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని టక్కోలు గ్రామానికి చెందిన కొత్త ఆ టోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తు న్నారని తనకు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను స్వాధీనం చేసుకుని, ఆటో డ్రైవర్ హనుమత్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. మొత్తం ఆరు బస్తాల బియ్యం, 300 కిలోలు ఉంటాయన్నారు. ఈ మేరకు విచారించి కేసు నమోదు చేస్తామన్నారు.

# ఆగి ఉన్నలారీని ఢీ కొట్టిన మరో లారీ

కొండాపురం: మండల పరిధిలోని పెంజి అనంతపురం సర్కిల్ వద్ద ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీ కొట్టిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ హరికృష్ణకు తీవ్రగాయలయ్యాయని కొండాపురం ఎస్ఐ జయరాములు సోమవారం తెలిపారు. ఈఘటనలో లారీ క్యాబిన్‌లో హరికృష్ణ ఇరుక్కుపోయాడు. స్థానికులు పోలీసుల సహాయంతో అతన్ని బయటకు తీశారు. క్షతగాత్రున్ని 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# బుచ్చి అర్బన్ లో భారతీయ జనతా పార్టీ జనతా వారధి కార్యక్రమం





**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జూలై 20 :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ఏర్పాటు చేసిన జనతా వారధి కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా తిరుపతి జిల్లా ఇంచార్జ్ జనతా వారిధి కార్యక్రమం కోవూరు నియోజకవర్గ కన్వీనర్ గంజం. పెంచల ప్రసాద్ ఆధ్వర్యంలో బుచిరెడ్డిపాళెం పురపాలక సంఘం చైర్ పర్సన మోర్ల.సుప్రజ కమీషనర్ ఇనమల.చినబాబు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పెంచల ప్రసాద్ మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలోని 20వ వార్డు పరిధిలో గల జగనన్న కాలనీలో ఇళ్ళు నిర్మాణం చేపట్టేందుకు సరిగా నీటి సరఫరా లేకపోవడం వలన నిర్మాణాలు ఆగిపోవడం జరిగిందని,అదేవిధంగా 16వ వార్డులోని డి.ఎల్.ఎన్.ఆర్ హైస్కూల్ ప్రాంతంలో నిర్మాణం చేపడుతున్న డ్రైనేజీను ఇంకొక 50 మీటర్లు పెంచి నిర్మాణం చేపట్టమని, అదేవిధంగా 15వ వార్డు పరిధిలోని సుబ్బారెడ్డి నగర్ నందు ఉన్న రోడ్డు సమస్యలు పరిష్కరించమని,మూడవ వార్డు పరిధిలోని క్రిష్ణా థియేటర్ ప్రాంతంలోని 5వ వీధిలో రోడ్డుకి ఇరువైపులా మొదటి నుంచి చివరి వరకు ఇల్లు ఉన్నప్పటికీ ఆ వీధి మాత్రమే డ్రైనేజీ నిర్మాణం చేపట్టలేదని ఆ ఒక్క వీధి డ్రైనేజీ ఆపడంలో అంతరార్థం ఏమిటని అదేవిధంగా ఆ ప్రాంతంలో గతంలో వేసిన సి.సి రోడ్లకు గ్రౌండ్ కు రెండు అడుగుల మేర వ్యత్యాసం ఉన్నందువల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని కావున రోడ్డుకు ఇరువైపులా సైడ్ బరమ్స్ వేయాలని,రేపాల బ్రాంచ్ రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాన్ని తొలగించమని ఈ సమస్యలన్నిటిపై గతంలో అనేకమార్లు అర్జీలు ఇవ్వడం జరిగిందని కానీ ఇప్పటివరకు పరిష్కారం దిశగా అడుగులు వేయలేదని.... రాష్ట్రంలోనే సేవలో ముందుండే కోవూరు నియోజకవర్గ శాసనసభ్యులు వేమిరెడ్డి.ప్రశాంతిరెడ్డి ఏ సమస్యనైనా త్వరిత గతిన పరిష్కరించమని చెబుతున్న ఈ సమయంలో కూడా ఈ చిరకాల సమస్యలకు పరిష్కారం చూపకపోతే ఇక ఎప్పటికీ ఈ పరిష్కారం కావని... కావున శాసనసభ్యులు వేమిరెడ్డి.ప్రశాంతి రెడ్డి ఈ సమస్యల పైన అధికారులతో చర్చించి పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు షేక్.ఖాదర్ భాషా,దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గోళ్ల.నరసింహులు,మండల ఉపాధ్యక్షులు మచ్చా.కోటేశ్వరరావు,ఓబిసి నాయకులు నీలం.వెంకటేశ్వర్లు,గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు రాగి.ప్రసాద్ నాయకులు దేవరకొండ.ప్రసాద్ మరియు స్థానిక ప్రజలు కరిపిరెడ్డి.కృష్ణారెడ్డి,శాఖాపురం.తిరుపతయ్య,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చి లో ట్రాఫిక్ పై కౌన్సెలింగ్






**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జూలై 20 :** బుచ్చిరెడ్డిపాలెం అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుచ్చిరెడ్డిపాలెం టౌన్ లో ట్రాఫిక్ ప్రాబ్లం ఉందని నేషనల్ హైవే కి ఇరువైపులా షాపులు పక్కన అరటికాయ బండ్లు ఆటోలు మార్జిన్ దాటి వచ్చాయని వచ్చేసి ప్రమాదాలు జరుగుతున్నాయి యని ప్రజలందరూ కూడా అసౌకర్యంగా ఉందని ఈరోజు ఆటో డ్రైవర్ల అందరిని కూడా పోలీస్ స్టేషన్ కి పిలిపించి ట్రాఫిక్ పై కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది డ్రైవింగ్ లైసెన్సు ఆటో రికార్డ్స్ కూడా వెరిఫై చేసి అలాగే రోడ్డుకి ఇరువైపులా మార్జిన్ లోకి దిగి ఆపుకోవాలని ఎక్కించుకునేటప్పుడు ప్రజలకు ఇబ్బంది లేకుండా అలాగే హైవేలో పోయేటటువంటి వెహికల్స్ కి ఏదైనా షాప్ లో కొనుగోలు చేయాలనుకునేటప్పుడు రోడ్డు మార్చ్ దిగి ఆపుకునేటటువంటి స్పేస్ ఇచ్చి తర్వాత మాత్రమే ఆపుకోవాలని వాళ్ళందరికీ హెచ్చరికలు జారీ చేయాలని ఎవరైనా సరే దాన్ని ఉల్లంఘించి ఇతర ట్రాఫిక్ కి అంతరాయం కలిగిస్తే వారి పైన చలానా జారీ చేస్తామని చెప్పడం జరిగింది డ్రైవింగ్ లైసెన్స్ అయిపోయిన వాళ్లకి అట్లాగే లేని వాళ్ళకి తీసుకోమని హెచ్చరించడం జరిగింది ముఖ్యంగా మేడం తో జాగ్రత్తగా ఉండాలని చెప్పి చెడు అలవాట్లకు పోకూడదని చెప్పేసి వాళ్లని మందలించడం జరిగింది అలాగే తోపుడు బండ్లు ఇతర ఇతర అమ్ముకునే వాళ్ళు రోడ్డు పక్కన రోడ్డు కి అనుకోని పెట్టొద్దు షాపులకి ఆనుకొని పెట్టుకొని రోడ్డు విశాలంగా ఉండే ప్రదేశాన్ని ప్రమాదాలు జరగకుండా ఉంటాయి దానిని ఉల్లంఘించి ముందుకు వచ్చినట్లయితే మాత్రం వారి మీద కేసు నమోదు చేసి కోర్టుకి పెట్టడం జరుగుతుంది . ఈ ట్రాఫిక్ రెగ్యులేషన్ లో షాపులు వాళ్ళు అలాగే చిన్న చిన్న వర్తకులు తోపుడు బండ్లు పెట్టుకునేవాళ్ళు అలాగే ఆటోలు నడుపుకునే వాళ్ళందరూ కూడా పోలీస్ వాళ్లకి సహకరించాలి మేము పదేపదే చెప్తున్నా వినకుండా ట్రాఫిక్ అంతరాయం కానీ కలిగించినట్లయితే వారి మీద చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది సదరు వాహనాలు గాని ట్రాఫిక్ అడ్డంపెట్టినటువంటి ఏ వస్తువు నాయనా స్వాధీనం పరుచుకొని కోర్టుకి పెట్టడం జరుగుతుంది

# ఎరువుల పంపిణీలో పూర్తిపారదర్శకత పక్కదారి అనే మాట లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ, పెన్ పవర్, జులై, 20 :** రైతులకు నాణ్యమైన ఎరువులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పంట విస్తీర్ణానికి అనుగుణంగా పూర్తి పారదర్శకంగా అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఎరువుల పంపిణీలో పక్కదారి పట్టే అవకాశాలకు పూర్తిగా చెక్ పెడుతూ, ఆధునిక సాంకేతికత ఆధారంగా ఎరువుల సరఫరా ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ లక్ష్మీశ సోమవారం విస్సన్నపేటలో పీఏసీఎస్-ఎరువుల సరఫరా కేంద్రాన్ని పరిశీలించారు. ఎరువుల పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ వ్యవసాయ సమాచార నిర్వహణ వ్యవస్థ (ఏపీఎయిమ్స్) యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకుని సమగ్ర వ్యవసాయ సేవలను పొందాలని సూచించారు. ప్రతి ఎరువుల దుకాణంలో ప్రత్యేక సమాచార కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యలు ఉంటే కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ నంబర్ 91549 70454 లేదా స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఉద్యాన పంటలు, స్వల్పకాలిక వరి రకాలు, అంతర పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. దీంతో నీటి వినియోగం తగ్గడంతో పాటు పంట నష్టాల ప్రమాదం తగ్గి మెరుగైన దిగుబడి, ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. కలెక్టర్ లక్ష్మీశ స్థానికంగా ఉన్న సేంద్రియ వ్యవసాయ క్షేత్రాన్ని కూడా సందర్శించారు. అక్కడ అమలవుతున్న ప్రకృతి సేద్య విధానాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి సేద్యం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని, ఆరోగ్యాన్ని ఇచ్చే వ్యవసాయ ఉత్పత్తులను పొందొచ్చని పేర్కొన్నారు.

# రోడ్లపై ఉన్న గుంతలను (పోట్ హోల్స్) రాబోయే రెండు రోజుల్లోగా పూర్తి చేయాలి : కమిషనర్ .మయూర్ అశోక్




**గుంటూరు, పెన్ పవర్, జులై, 20 :** గుంటూరు నగరంలో వాహనదారుల భద్రతకు, ప్రయాణ సౌకర్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ రోడ్లపై ఉన్న గుంతలను (పోట్ హోల్స్) రాబోయే రెండు రోజుల్లోగా పూర్తిగా పూడ్చివేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల వేగవంతం, రెవెన్యూ కలెక్షన్ పై అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రోడ్లపై గోతులను యుద్ధప్రాతిపదికన పూడ్చివేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రోడ్ల మరమ్మతుల కోసం పోట్ హోల్స్ పూడ్చే మెషిన్ నిరంతరం రన్నింగ్‌లో ఉండేలా చూడాలని, రాబోయే వారం రోజులకు సంబంధించి స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా జంక్షన్లు, లో-లెవల్ ప్రాంతాలు మరియు హైవేలను అనుసంధానించే రోడ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అలాగే మేజర్ డ్రైన్లలో కాంట్రాక్టర్ మెయింటెనెన్స్ గ్యారెంటీ ఉన్నందున మరలా పూడికతీత పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న భవన నిర్మాణ వ్యర్థాలను భవన నిర్మాణదారులే రోడ్లపై నుండి తక్షణమే తొలగించేలా, ఎవరైనా రోడ్లపై వ్యర్థాలు వేస్తే భారీ అపరాధ రుసుం విధించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. నగరంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకూడదని, ఎక్కడైనా లీకేజీలు ఉంటే వెంటనే అరికట్టాలన్నారు. వాటర్ మీటర్ రీడింగ్ ప్రక్రియను సంబంధిత డీఈఈలు స్వయంగా పర్యవేక్షించాలని, రీడింగ్‌ను ప్రతి నెల మూడో వారంలో ఖచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలపై వచ్చే ప్రజల ఫిర్యాదులను అత్యంత వేగంగా పరిష్కరించాలని, డ్రైనేజీ ఛానల్స్‌లో పేరుకుపోయిన పూడికను నిరంతరం తొలగించాలని ఆదేశించారు. పౌర సేవలకు సంబంధించి నిర్దేశిత గడువు దాటి ఏ ఒక్క అప్లికేషన్ కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదన్నారు. మరోవైపు ప్రస్తుతం నగరపాలక సంస్థలో రెవెన్యూ కలెక్షన్ మందగించడంపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వసూళ్లను ముమ్మరం చేయాలని ఆదేశించారు. కేవలం సాధారణ ప్రజలే కాకుండా, నగరంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సిన మున్సిపల్ పన్నులు, బకాయిలను కూడా ఖచ్చితంగా వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ఖాళీ స్థలాల పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనుల ప్రస్తుత స్థితిపై తాజా నివేదికను తక్షణమే అందించాలని ఎస్ఈని ఆదేశించారు.సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కిషోర్, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డిసిపి సూరజ్ కుమార్, ఆర్ఓలు, ఈఈలు పాల్గొన్నారు.

# మనవూరు - మన జెండా కార్యక్రమం : బి జె పి



**గుంటూరు, పెన్ పవర్, జులై, 20 :** భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గుంటూరు పశ్చిమ అసెంబ్లీ లోని 3 వ మండలం బ్రాడేపేట 4/14 లో "మనవూరు - మన జెండా "కార్యక్రమంలో భాగంగా బిజెపి జెండా ఆవిష్కరణ " మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి పావని రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షులు నిషిదా రాజు , జిల్లా బిజెపి అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు , మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. నాగ మల్లీశ్వరి , జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు డా,,రాదా మాధవి ముఖ్య అతిథులుగా జెండా ఎగురవేయడం జరిగింది .. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిషిదారాజు మాట్లాడుతూ " రాష్ట్ర పర్యటన సందర్భంగా ఈ రోజు గుంటూరులో మన ఊరు - మన జెండా కార్యక్రమంలో భాగంగా బిజెపి జెండా ఆవిష్కరణ చెయ్యటం జరిగింది , పల్లెపల్లెనా , అన్ని మండలాలలో బిజెపి జెండా రెపరెపలాడేలా చేస్తూ ఆ పోల్ కి ఒక డిజిటల్( జియో)టాగ్ ద్వారా ఆ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సెంట్రల్ గవర్నమెంట్ ద్వారా జరుగుతున్న సంస్కరణలు , చెయ్యవలసిన అభివృద్ధి కార్యక్రమాలు , పార్టీ నాయకుల వివరములు అన్ని తెలియచేసే విధంగా ఈ జియో టాగ్ ఉపయోగపడనున్నదని " తెలియచేశారు ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు పాలపాటి రవికుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ , మాజీ కార్పొరేటర్ పాటిబండ్ల ఉషారాణి , జాతీయ స్పైసెస్ సంస్థ డైరెక్టర్ కే వి సుబ్బారావు , మిర్చి యార్డు డైరెక్టర్ శ్రావణ కుమారి ,కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ సుబ్బారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి , ఈమని మాధవరెడ్డి , ఉయ్యాల శ్యామ్ ప్రసాద్ యువమోర్చా నాయకులు సాయి రాధాకృష్ణ , కావేరి మధు , శ్రీ దుర్గ , బొల్లాప్రగడ శ్రీదేవి, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వర్రె లలిత , పాలడుగు సుభాషిణి , మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శ్రీమతి రోహిణి , సుష్మా రెడ్డి , జిల్లా బిజెపి నేతలు స్రవంతి , రాధిక , స్వాతి , కాసు శ్రీదేవి , శిరీష , జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మంత్రి సుగుణ , విమలాదేవి , కోలా రేణుకా దేవి , నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు...

# మహిళపై జరిగిన దాడి అత్యంత అమానవీయం నిందితులకు కఠిన శిక్ష తప్పదు

### బీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి జై ప్రకాష్ నారాయణ



**గుంటూరు, పెన్ పవర్, జులై, 20 :** గుంటూరు నగరంలో ఒక మహిళపై జరిగిన దాడి అత్యంత దురదృష్టకరం, అమానవీయం మరియు ఖండించదగినది. భారతీయ జనతా పార్టీ తరఫున ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. మహిళల గౌరవం, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. చట్టాన్ని చేతిలోకి తీసుకునే వారికి రాజకీయ పార్టీ, కులం, మతం అనే తేడా లేకుండా చట్టం ముందు సమానంగా శిక్ష పడాలి. ఈ ఘటనకు సంబంధించి పోలీసు శాఖ సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపి, వాస్తవాలను వెలికితీయాలి. దోషులెవ్వరైనా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తోంది. అయితే, ఒక బాధాకరమైన ఘటనను ఆధారంగా చేసుకుని రాజకీయ దుష్ప్రచారం చేయడం పూర్తిగా బాధ్యతారాహిత్యం. మహిళల బాధను రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం ఏ రాజకీయ పార్టీకి తగదు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మహిళల గౌరవం, భద్రత విషయంలో అనేక సందర్భాల్లో తన స్పష్టమైన అభిప్రాయాన్ని వెల్లడించారు. అలాగే భారతీయ జనతా పార్టీ "నారీ శక్తి" సాధికారతను తన సిద్ధాంతంలో భాగంగా భావిస్తూ, మహిళల రక్షణకు కట్టుబడి ఉంది. భారతీయ జనతా పార్టీ మహిళపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరగాలి. దోషులు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబడాలి. ఈ ఘటనను రాజకీయ రంగు పులమడం మానుకోవాలి. మహిళల గౌరవాన్ని కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి పౌరుడి బాధ్యత. ఈ విషయంలో భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ రాజీపడదు.

# కూటమి విచ్ఛిన్నమే లక్ష్యంగా జగన్ సాగిస్తున్న విధ్వంస రాజకీయాల్ని సమర్థంగా తిప్పికొట్టాలి

### 'స్థానిక' సమరంలో మూడుపార్టీల విజయమే.. వైసీపీ విషప్రచారానికి అసలైన విరుగుడు
### నిబద్ధత, నిజాయితీ, నిష్పక్షపాతమైన రాజకీయాలతో ప్రజానాయకుడిగా ఎదిగిన మన అధినేతే మనందరికీ ఆదర్శం కావాలి



**చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 20 :** కూటమి ఐక్యతను విచ్ఛిన్నం చేసి, రాష్ట్రాభివృద్ధిని అడ్డుకొని తన విధ్వంస రాజకీయాలతో ప్రజల్ని దోచుకోవాలన్నదే జగన్ లక్ష్యమని, గొడ్డలిపార్టీ విషప్రచారాలను సమర్థంగా తిప్పికొట్టి, స్థానిక ఎన్నికల్లో మరోసారి తిరుగులేని ప్రజావిజయాన్ని సొంతం చేసుకోవాలని టీడీపీ జోనల్ కోఆర్డినేటర్, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు టీడీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

సోమవారం ఆయన మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ యూనిట్ ఇన్ ఛార్జుల శిక్షణా తరగతుల్లో మాట్లాడారు. తొలుత ఇన్ ఛార్జులను పరిచయం చేసుకున్న ప్రత్తిపాటి.. వారిని పేరుపేరునా పలకరించారు. అనంతరం కూటమిపార్టీల ఐక్యత, దానివల్ల రాష్ట్రానికి, ప్రజలకు కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. స్థానిక ఎన్నికల్లో కూటమిపార్టీల విజయంతో ఏపీకి ఎనలేని ప్రయోజనాలు చేకూరతాయన్నారు.

**విధ్వంసాన్ని నమ్ముకున్నందునే ప్రజలు వైసీపీకి బుద్ధిచెప్పారు :** పార్టీ శ్రేణులు ఎలాంటి అసమ్మతి, అసంతృప్తికి తావు లేకుండా రాష్ట్రాన్ని, ప్రజల్ని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలన్న ప్రత్తిపాటి.. విధ్వంసాన్ని నమ్ముకొని, విద్వేషాల్ని రెచ్చగొట్టినందునే ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పారనే వాస్తవాన్ని శ్రేణులు గ్రహించాలన్నారు. జగన్ మాదిరే అధికారం కోసం గొడ్డలిని, ఫ్యాక్షన్ రాజకీయాల్ని, కక్షసాధింపుల్ని నమ్ముకుంటే.. వైసీకికి, కూటమికి తేడా ఏముంటుందన్న ప్రత్తిపాటి. ప్రజలు ఐదేళ్లు జగన్ సాగించిన అరాచకాలకు ఎలా చెక్ పెట్టారో గ్రహించాలన్నారు. జగన్ ప్రజలకు, రాష్ట్రానికి చేసిన నష్టాన్ని పూడ్చటానికి, భావితరాలకు ఉజ్వల భవిష్యత్ అందించడానికి మన నాయకుడు రేయింబవళ్లు శ్రమిస్తున్నాడన్నారు. యువనేత లోకేశ్ సమర్థత, వినూత్నఆలోచనలు రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చాయన్నారు. ఇతర రాష్ట్రాలు అసూయపడేలా లోకేశ్ పెట్టుబడుల ఆకర్షణలో మిసైల్ కంటే వేగంగా దూసుకెళ్తున్నాడనే వాస్తవాన్ని పార్టీశ్రేణులు గ్రహించాలన్నారు. నిబద్ధత, నిజాయితీ, నిష్పక్షపాతంతో నిజమైన రాజకీయ నాయకుడిగా ప్రజల మన్ననలు పొందుతున్న అధినేత చంద్రబాబునాయుడిని ప్రతి కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు.


**'స్థానిక' సమరంలో కూటమి విజయమే.. వైసీపీ విషప్రచారాలకు అసలైన విరుగుడు :** త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లోకూటమి పార్టీలతో టీడీపీ శ్రేణులు గతంలో కంటే మెరుగ్గా సమన్వయం చేసుకోవాలని, మూడుపార్టీల ఐక్యతతో ప్రజలు అందించే విజయమే వైసీపీ విషప్రచారానికి అసలైన విరుగుడు అని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. మూడుపార్టీల మధ్య అగ్గిరాజేసి, ఆ మంటల్లో చలికాచుకోవడానికి, జగన్ రోజుకో కొత్త కుట్రకు తెరలేపుతున్నాడని ప్రత్తిపాటి చెప్పారు. చంద్రబాబు నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమర్థవంతంగా వైసీపీ కుట్రలను తిప్పికొట్టడం వల్లే ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. పెట్టుబడిదారుల్ని తన్ని తరిమేసిన జగన్.. సొంత రాష్ట్రాన్ని నాశనం చేసి, పొరుగురాష్ట్రాలను బాగుచేశాడని, దానికి ప్రత్యక్ష ఉదాహరణ అమర్ రాజా సంస్థే అని ప్రత్తిపాటి చెప్పారు. అమర్ రాజా సంస్థ టీడీపీ ఎంపీదన్న ఒకే ఒక్క కారణంతో జగన్ దాన్నిరాష్ట్రం నుంచి తరిమేసి, దాదాపు 5 వేలమందికి ఉపాధి లేకుండా చేశాడన్నారు. జగన్ దుర్మార్గాలు కళ్లారా చూసిన ప్రజలు ఎప్పటికీ వైసీపీ మాయలో పడరని, నిరంతర అభివృద్ధి, పారదర్శక సంక్షేమంతో ప్రజలు కూటమి పార్టీలను గుండెల్లో పెట్టుకుంటారని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

# సాగునీటి పంపిణీ పై అధికారులతో కలెక్టర్ సమీక్ష



**మచిలీపట్నం, పెన్ పవర్, జులై 20 :** మచిలీపట్నంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తూర్పు కృష్ణా డెల్టా బోర్డ్ అడ్వైజరీ బోర్డు (బీఏబీ) సమావేశం సోమవారం నిర్వహించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని సాగునీటి నిర్వహణ, కాలువల ద్వారా నీటి విడుదల, నీటి పంపిణీ విధానం, ఆయకట్టు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు విస్తృతంగా చర్చించారు.ప్రధాన, ఉప కాలువల నిర్వహణ, మరమ్మతుల పురోగతి, నీటి వృథాను నివారించే చర్యలు, కాలువల్లో పూడిక తొలగింపు, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే అంశాలపై సమీక్ష నిర్వహించారు. రైతులకు అవసరమైన సమయంలో నీరు అందేలా సాగునీటి విడుదలకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులకు సూచనలు చేశారు.నీటి లభ్యత, రిజర్వాయర్ల పరిస్థితి, వర్షపాతం ఆధారంగా నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, సాగునీటి పంపిణీలో పూర్తి పారదర్శకత పాటించాలని సమావేశంలో పేర్కొన్నారు. వ్యవసాయం, నీటిపారుదల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ ప్రతినిధులు, డెల్టా పరిధిలోని సంబంధిత అధికారులు, రైతు ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. ఖరీఫ్ సాగు సీజన్‌ను విజయవంతం చేయడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో గూడూరు, బంటుమిల్లి డీసి చైర్మన్ లు పోతన స్వామి నాయుడు, బొర్రా కాశీ,నల్లమోతు రఘురామ్, అధికారులు పాల్గొన్నారు.

# జీవో 396ను రద్దు చేయాలంటూ చిలకలూరుపేటలో 'పెన్ డౌన్' నిరసన.




**చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 20 :** ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చిలకలూరుపేట దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు మరియు డిటిపి ఆపరేటర్లు నిరసన బాటపట్టారు . రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా, సోమవారం (జూలై 20) నుండి 31వ తేదీ వరకు పది రోజుల పాటు 'పెన్ డౌన్' నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రకటించారు.

**ప్రజల ఆస్తులకు ముప్పు :** ఈ సందర్భంగా ఏ సత్యనారాయణ ఆంధ్రప్రదేశ్ దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు మరియు డిటిపి ఆపరేటర్లు కోశాధికారి మాట్లాడుతూ, ఆర్ఎస్కే సేవా కేంద్రాల ద్వారా ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిర్వహించడం వల్ల ప్రజల భూములు, ఆస్తులు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి, తమ ఉపాధిని దెబ్బతీసే మరియు ప్రజల ఆస్తులకు భద్రత లేని ఈ జీవోను ఉపసంహరించుకోవాలని వారు కోరారు.

**నిరసనలతో ఆగిపోయిన రిజిస్ట్రేషన్లు :** రాష్ట్రవ్యాప్తంగా డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు తమ విధుల నుండి విరమించుకోవడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రిజిస్ట్రేషన్ ప్రక్రియలకు ఆటంకం ఏర్పడుతోంది. తమ డిమాండ్లను ప్రభుత్వంపరిష్కరించని పక్షంలో,రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ప్రజలందరూ తమ హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన ఈ ఉద్యమానికి సహకరించాలని చిలకలూరుపేట దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్ల సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది.

# ఫిర్యాదుల పరిష్కారం బాధ్యతగా భావించండి

### మీకోసంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

కోనేరుసెంటర్: మీకోసంలో వచ్చే ఫిర్యాదులను పరిష్కరించటంలో అధికారులు, సిబ్బంది ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు అందుకున్నారు. కొన్ని అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని అర్జీలను సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడి వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీకోసంలో అందిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో సిబ్బందిపై ఎలాంటి ఆరోపణలు రాకుండా చూసుకోవాలని, అటువంటి ఆరోపణలు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మీకోసంలో మొత్తం 56 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ తెలిపారు.

# హైదరాబాద్ - విజయవాడ ఇక నాన్‌స్టాప్!

విజయవాడకు వెళ్లే ప్రైవేటు బస్సు ఎక్కి తే, ఎల్బీనగర్ దాటిన తర్వాత మధ్యలో రాత్రి భోజనానికో, టీ తాగేందుకో తప్ప మరెక్కడా ఆగకుండా నేరుగా విజయ వాడకు చేరుకుంటుంది. అదే, ఆర్టీసీ బస్సులో ఎక్కితే భోజన, టీ విరామాలతోపాటు అదనంగా కోదాడ, సూర్యా పేట బస్టాండ్లలో ఆగుతుంది. ఇది ఆక్యుపెన్సీ రేషియోపై ప్రభావం చూపుతున్నట్లు తాజాగా ఆర్టీసీ గుర్తించింది. వేగంగా విజయవాడకు చేరుకోవాలనుకునే చాలామంది, ఈ ఒక్క కారణంతో ట్రావెల్స్ బస్సులను ఆశ్రయిస్తున్నట్లు తే లింది. ఇప్పుడు గరుడ, రాజధాని సహా ప్రీమియం కేటగిరీ సర్వీసులకు, ఆ హాల్టులను తప్పించి నేరుగా విజయవాడకు నాన్‌స్టాప్ సర్వీసులుగా నడపాలని ఆర్టీసీ భావిస్తోంది. అవసరమైతే ఆ రెండు ప్రాంతాలకు మరిన్ని సర్వీసులు తిప్పాలని యోచిస్తోంది.

# దోబూచులాడుతున్న వరుణుడు

**విజయవాడ, జూలై 20, పెన్ పవర్:** వరుణుడు దోబూచులాడుతున్నాడు. అప్పుడప్పుడూ వర్షాలు కురుస్తున్నా కూడా సాధారణం కంటే అతి తక్కువ వర్షపాతం నమోదైంది. ఏపీలో జూలై నెలలో 35 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఐదు జిల్లాలు మినహా మిగతా అన్ని జిల్లాలలో లోటు వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. మరోవైపు ఎల్ నినో కారణంగా దేశంలోని అనేక ప్రాంతాలలో తక్కువ వర్షపాతం నమోదౌతుందని ఐఎండీ అధికారులు వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వరుణుడు దోబూచులాడుతున్నాడు. దీంతో ఏపీలో లోటు వర్షపాతం 35 శాతానికి పెరిగింది. రాష్ట్రంలోని మొత్తం 28 జిల్లాలలో దాదాపు 20 జిల్లాలలో తక్కువ లేదా అత్యల్ప వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. జూన్ 1 నుంచి జూలై 17 మధ్య సాధారణ వర్షపాతం 162.6 మి.మీ. కాగా, రాష్ట్రంలో 106.3 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైనట్లు ఐఎండీ తెలిపింది. కోస్తాంధ్ర ప్రాంతంలోని గుంటూరు, పల్నాడు, విజయనగరం జిల్లాలు.. అలాగే రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలలో సాధారణం లేదా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని ఈ జిల్లాలు మినహా, మిగిలిన జిల్లాలలో తక్కువ లేదా భారీ లోటు వర్షపాతాన్ని నమోదు చేసినట్లు ఐఎండీ వెల్లడించింది.పశ్చిమ గోదావరి, అన్నమయ్య, యానాం జిల్లాల్లో 60 శాతం లోటు వర్షపాతం నమోదు కాగా.. అల్లూరి సీతారామ రాజు జిల్లాలో 50 శాతం కంటే ఎక్కువ లోటు నమోదైంది. అలాగే తిరుపతి, కడప, బాపట్ల, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, ప్రకాశం జిల్లాల్లో 40 శాతం కంటే ఎక్కువ వర్షపాత లోటు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, అనంతపురం జిల్లాలో మాత్రమే సాధారణ స్థాయికి సమానమైన 95.7 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 1 నుంచి జూలై 17 వరకు సాధారణ వర్షపాతం 192.7 మిల్లీమీటర్లతో పోలిస్తే 35 శాతం లోటుతో 126 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. రాయలసీమకు సంబంధించి సాధారణంగా కురవాల్సిన 119.9 మి.మీ వర్షపాతానికి బదులుగా 83.3 మి.మీ వర్షపాతం నమోదైందని.. ఇది 31 శాతం లోటని ఐఎండీ తెలిపింది.మరోవైపు జూలైలో రుతుపవనాల వేగం మందగించడంతో.. గత వారం రోజులుగా కొన్ని ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్ నుంచి 40 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అనేక జిల్లాలలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని.. జూలైలో కోస్తాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో వడగాలుల పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో, దేశంలోని అనేక ప్రాంతాలు వర్షాభావాన్ని ఎదుర్కొనవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. బంగాళాఖాతంలో అనుకూల పరిస్థితులు ఏర్పడితే, రుతుపవనాలు తిరిగి బలం పుంజుకోవచ్చని తెలిపారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## సిదిరిని భయపెడుతున్న కేసులు

**శ్రీకాకుళం, జూలై 20, పెన్ పవర్:** :ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో శ్రీకాకుళం జిల్లా మరోసారి చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన కీలక నాయకుల చుట్టూ వరుసగా వివాదాలు నెలకొంటుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే జిల్లాలో పలువురు ప్రముఖ నేతలు వివిధ కారణాలతో వార్తల్లో నిలిచిన నేపథ్యంలో, ఇప్పుడు మాజీ మంత్రి సీదరి అప్పలరాజు పేరు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆయనపై నమోదైన కేసు, అరెస్టు జరిగే అవకాశాలపై జరుగుతున్న ప్రచారం జిల్లాలో రాజకీయ చర్చలకు దారితీస్తోంది.గతంలో పార్టీ తరఫున దూకుడుగా స్పందిస్తూ అధికార పక్షంపై విమర్శలు చేసిన నాయకుల్లో సీదరి అప్పలరాజు ఒకరు. జిల్లాలో పార్టీ తరఫున బలమైన స్వరం వినిపించే నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. అయితే ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం వ్యవహారం ఆయనను ఇబ్బందుల్లోకి నెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో ఆయన కుమారుడు ఆరవ్ వర్మ పేరు ప్రధానంగా వినిపిస్తోంది.పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, వేగంగా బైక్ నడపడం వల్ల జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన అనంతరం ఆరవ్ వర్మను పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆయనను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు సమాచారం. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో మాజీ మంత్రి పాత్రపై కూడా పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.దర్యాప్తులో భాగంగా ప్రమాదానికి సంబంధించిన ఆధారాలను ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందనే అనుమానాలపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మాజీ మంత్రిపై కూడా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు ప్రచారం సాగుతోంది. భారతీయ న్యాయ సంహిత లోని 61(2), 238, 240, 242, 249, 49 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ కేసు ఆధారంగా తదుపరి చర్యలు ఏముంటాయన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.మాజీ మంత్రి అరెస్టు జరిగే అవకాశముందంటూ పలాస ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటివరకు పోలీసులు అధికారికంగా అలాంటి ప్రకటన చేయలేదు. మరోవైపు సీదరి అప్పలరాజు కూడా ఈ ఘటనపై బహిరంగంగా స్పందించలేదు. ఆయన మౌనం కూడా ఈ వ్యవహారంపై మరిన్ని చర్చలకు కారణమవుతోంది.సమాచారం ప్రకారం, ప్రస్తుతం ఆయన న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కేసు పురోగతిని దృష్టిలో పెట్టుకుని తదుపరి న్యాయపరమైన చర్యలపై చర్చిస్తున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అదే సమయంలో పోలీసు అధికారులు కూడా ఈ కేసును అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నట్లు సమాచారం. శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు వివిధ కారణాలతో వార్తల్లో నిలిచిన పరిస్థితుల్లో, ఇప్పుడు మాజీ మంత్రి చుట్టూ నెలకొన్న ఈ పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## స్వర్ణగ్రామాలుగా మార్పు

**ఒంగోలు, జూలై 20, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ, వార్డు స్థాయిలో ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థకు ఇప్పుడు కొత్త గుర్తింపు తీసుకురావాలని కూటమి ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇప్పటికే ఈ కార్యాలయాల పేర్లను మార్చిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ మార్పు ప్రజల్లో స్పష్టంగా కనిపించేలా రాష్ట్రవ్యాప్తంగా కొత్త నేమ్‌బోర్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీంతో ఇకపై "సచివాలయం" అనే పేరుకు బదులుగా "స్వర్ణ గ్రామం" "స్వర్ణ వార్డు" పేర్లు అధికారికంగా మరింత ప్రాధాన్యం పొందనున్నాయి.గ్రామ, వార్డు సచివాలయాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 2019 అక్టోబర్ 2న ప్రారంభించింది. ఆ తర్వాత ఈ వ్యవస్థ ద్వారా పలు ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. అయితే 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థపై సమగ్రంగా అధ్యయనం చేసిన అనంతరం పేర్లలో మార్పు తీసుకొచ్చింది. అధికారిక రికార్డుల్లో కొత్త పేర్లు అమల్లోకి వచ్చినప్పటికీ, ప్రజల్లో మాత్రం ఇప్పటికీ చాలా మంది వాటిని సచివాలయాలుగానే పిలుస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం కొత్త చర్యలకు శ్రీకారం చుట్టిందిరాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 15 వేలకుపైగా కార్యాలయాల వద్ద ఒకే నమూనాలో కొత్త నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బోర్డుల రూపకల్పన, పరిమాణం, నాణ్యత విషయంలో కూడా స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఆరు మిల్లీమీటర్ల అక్రిలిక్ షీట్‌తో పాటు 3ఐ8 అడుగుల ఏసీపీ ( బోర్డులను తయారు చేయాలని నిర్ణయించింది. ఈ బోర్డుల తయారీ, సరఫరా బాధ్యతలను గుంటూరు జిల్లా తాడేపల్లి లోని నెక్స్టోరా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు టెండర్ ప్రక్రియ ద్వారా అప్పగించింది.బోర్డుల తయారీ పూర్తయ్యే కొద్దీ వాటిని వేగంగా సంబంధిత కార్యాలయాలకు చేరవేసి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాలని సూచించింది. అలాగే మండల పరిషత్ అభివృద్ధి అధికారులు , మున్సిపల్ కమిషనర్లు (, సంబంధిత శాఖల అధికారులు బోర్డులను స్వీకరించి ప్రతి కార్యాలయం వద్ద సక్రమంగా అమర్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. బోర్డులు ఎలాంటి నష్టం లేకుండా అందాయని నిర్ధారించిన తర్వాత అధికారుల సంతకం, కార్యాలయ ముద్రతో వాటిని నమోదు చేయాలని కూడా స్పష్టం చేసింది. అంతేకాకుండా బోర్డుల వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసి, జిల్లా కోఆర్డినేటర్లు మొత్తం ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది.రాజకీయంగా కూడా ఈ నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. గతంలో సచివాలయ భవనాల రంగులు ఒక రాజకీయ పార్టీని గుర్తు చేసేలా ఉన్నాయని విమర్శలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భవనాలకు రాజకీయ పార్టీలను ప్రతిబింబించే రంగులు ఉండకూడదనే విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇప్పుడు కొత్త పేర్లతో పెద్ద నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల్లో కొత్త గుర్తింపును బలపరచాలని భావిస్తోంది. మరోవైపు, ఈ వ్యవస్థను ప్రారంభించింది తమ ప్రభుత్వమే కాబట్టి పేర్లు మారినా ప్రజలు దాని ఆరంభాన్ని గుర్తుంచుకుంటారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ అంశం పరిపాలనతో పాటు రాజకీయ చర్చలకు కూడా కేంద్రబిందువుగా మారింది.

## లోకల్ బాడీ ఎన్నికల్లో జనసేన లొల్లి..

**గుంటూరు జూలై 20, పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పోటీపై ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు కూటమిలో అగ్గి రాజేస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జనసేన, టీడీపీ నేతల మధ్య సీట్ల పంచాయతీకి దారితీసే అవకాశం ఉంది. అయితే టీడీపీ క్యాడర్ స్పందించి ఎలాంటి ప్రకటనలు చేయకుండా పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు ముందుగానే స్పందించి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.రాబోయే ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిలోని ఏ పార్టీ ఎన్నెన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనే అంశంపై టీడీపీ నాయకులెవరూ బహిరంగంగా మాట్లాడవద్దని పార్టీ అధినేతల చంద్రబాబు క్యాడర్‌ను ఆదేశించారు. పార్టీ ముఖ్య నేతలతో చంద్రబాబు శనివారం రాత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, అనవసర చర్చలకు అవకాశం ఇచ్చేలా ఏ ఒక్కరూ వ్యవహరించవద్దని హెచ్చరించారు. కూటమి భాగస్వామ్య పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య విభేదాలు సృష్టించడానికి గొడ్డలి పార్టీ వైసీపీ కాచుకుని కూర్చుందని, ఈ విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలని సూచించారు. ఎన్నికల కార్యాచరణను మరింత బలోపేతం చేసేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో వచ్చే నెల మొదటి లేదా రెండో వారంలో ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహిస్తామని చంద్రబాబు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల సీట్ల సర్దుబాటు గురించి టీడీపీ నేతలు చర్చించవద్దని, పోటీ చేసే స్థానాలపై ఎలాంటి ప్రకటనలు చేయవద్దని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆ అంశాన్ని కూటమి పార్టీల అగ్రనాయకత్వం సరైన సమయంలో చర్చించి నిర్ణయం తీసుకుంటుందన్నారు. పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధం చ్ఞేయడంపైనే ఫోకస్ చేయాలని సూచించారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి అద్భుత ఫలితాలు సాధించేలా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల గుంటూరులో కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో జనసేనకు బలం ఉన్న ప్రతి చోటా తాము తప్పకుండా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసం, వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశంతో అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసైనికులు వెనక్కి తగ్గారని గుర్తుచేశారు.

# అనకాపల్లి నుంచి అయోధ్యకు ట్రైన్..

**విశాఖపట్టణం, జూలై 20, పెన్ పవర్:**
అనకాపల్లి నుంచి అయోధ్య, కాశీకి ప్రత్యేక రైలు ఆదివారం బయల్దేరి వెళ్లింది. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్.. ఈ ప్రత్యేక రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఐదురోజుల పాటు దివ్యదర్శన యాత్ర కొనసాగనుండగా.. ప్రయాణం, వసతి. వైద్యం, భోజనం అన్నీ ఉచితంగా సమకూర్చనున్నారు. ఎంపీ సీఎం రమేష్ ఈ ప్రత్యేక రైలును ఏర్పాటు చేయించారు. సెప్టెంబర్ నెలలో మరో ప్రత్యేక రైలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని భక్తులకు అయోధ్య రామయ్య దర్శనం కల్పిస్తామని తెలిపారు.కాశీ, అయోధ్యకు వెళ్లాలనుకునే భక్తులకు శుభవార్త. అనకాపల్లి నుంచి కాశీ, అయోధ్యకు ప్రత్యేక రైలు ఆదివారం బయల్దేరి వెళ్లింది. ఈ ప్రత్యేక రైలును రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఆదివారం ఉదయం అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. అనకాపల్లి నుంచి అయోధ్య, కాశీ ఉచిత దివ్య దర్శన యాత్ర పేరుతో ఈ ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారు. తొలి విడతలో 1,500 మంది భక్తులు అయోధ్య, కాశీ పుణ్యక్షేత్రాల దర్శనానికి ప్రత్యేక రైలులో బయల్దేరి వెళ్లారు. రైలును ప్రారంభించిన అనంతరం ఎంపీ సీఎం రమేష్.. రైలులో ప్రయాణించి, ప్రయాణికులతో ముచ్చటించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి బోగీలోకి వెళ్లి యాత్రికుల సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు.ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన అయోధ్య, కాశీ ఉచిత దర్శన హామీని నిలబెట్టుకున్నట్లు తెలిపారు. ఉచిత దివ్య దర్శన యాత్ర ఐదు రోజుల పాటు కొనసాగుతుందని వెల్లడించారు. అయోధ్య - కాశీ దర్శనం ప్రతి హిందువు జీవితంలో ఒక ఆధ్యాత్మిక అనుభూతని.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు శ్రీరాముడు, కాశీ విశ్వనాథుడి దర్శనం కల్పించాలనే సంకల్పంతో ఈ యాత్ర ప్రారంభించినట్లు వెల్లడించారు. యాత్రలో భాగంగా ప్రయాణం, భోజనం, వసతి, త్రాగునీరు, వైద్య సేవలు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. ప్రతి కోచ్‌కు ప్రత్యేక ఇంఛార్జిలను, వాలంటీర్లను నియమించామని.. భక్తుల కోసం ప్రత్యేక వైద్య బృందాలు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.యాత్రికులను స్వాగతించడానికి, ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ముందుగానే వారణాసికి ప్రత్యేక వాలంటీర్ల బృందాన్ని పంపించామని.. ముందుగా కాశీ విశ్వనాథ స్వామి దర్శనం, అనంతరం అయోధ్య శ్రీరామ జన్మభూమి దర్శనం కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ యాత్ర పూర్తిగా సేవా కార్యక్రమం మాత్రమేనన్న ఎంపీ సీఎం రమేష్.. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని ప్రతి భక్తుడికి దశలవారీగా ఈ అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. రెండో విడత ప్రత్యేక రైలును సెప్టెంబర్‌లో ఏర్పాటు చేస్తామని.. ప్రజల స్పందన, అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక రైళ్లను కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

# పొత్తులకు వైసీపీ ప్రయత్నాలు

**విజయవాడ, జూలై 20, పెన్ పవర్:**
జగన్ వచ్చే ఎన్నికల్లో పొత్తుకు సిద్ధమవుతున్నారా? అంటే రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చు. ఎప్పుడూ దేనినీ తోసిపుచ్చలేం. ప్రచారమని ఇప్పుడు అనుకున్నా.. బలమైన ప్రత్యర్థిని మట్టికరిపించాలంటే తన బలగాన్ని కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. అదే యుద్ధనీతి. రీతి కూడా. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉంది. అయితే కూటమి పాలనపై వామపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయి. చంద్రబాబు పాలనపై విరుచుకుపడుతున్నాయి. అలాగే ప్రతి సమస్యపై పోరాడుతున్నాయి. మరొకవైపు కూటమి లో జరుగుతున్న ప్రతి ఘటనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎర్రదండు కార్యక్రమాలను రూపొందించుకుంది కూటమిలో బీజేపీ ఉండటంతో సహజంగానే వామపక్షాలు జగన్ కు చేరువవుతాయంటున్నారు. అలాగని జగన్ కూడా బీజేపీకి దూరం కాదు. కానీ ప్రత్యక్షంగా పొత్తు లేదు కాబట్టి వైసీపీతో కలసి నడవటానికి ఎర్రన్నలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సీపీఐ నేత రామకృష్ణ ఇటీవల కాలంలో పదే పదే విమర్శలు చేయడం, సీపీఐ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య సయితం ప్రతి అంశంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పందించడం ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. అలాగేఇక సీపీఎం తొలి నుంచి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగానే గళం విప్పుతూనే ఉంది. ఈ రెండు పార్టీలతో కలసి జగన్ వెళతారన్న ప్రచారం జరుగుతుంది. ఇప్పటి వరకూ జగన్ ఒంటరిగానే పోటీ చేస్తూ వచ్చారు. వామపక్షాలు మాత్రం ఒకసారి పవన్ తో కలసి పోటీ చేసి ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేదు. ఆ మాట కొస్తే రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఏర్పడిన ఆంధ్రప్రదేశ్



శాసనసభలో వామపక్షాలకు ఇప్పటి వరకూ ప్రాతినిధ్యం లేదు. అయితే జగన్ కు తన బలం, బలగంపై అపార నమ్మకం ఉంది. ఒంటరిగానే పోటీ చేయాలన్న తపన ఉంది. కానీ కూటమిని ఎదుర్కొనాలంటే ఓటు బ్యాంకు లేకపోయినా గట్టి వాయిస్ ఉన్న వామపక్ష పార్టీలు తోడుగా నిలిస్తే కొంత రాజకీయంగా ఉపయోగం ఉంటుందని జగన్ భావిస్తున్నట్లు తెలిసింది. అయితే దీనిపై ఇంకా క్లారిటీ లేకపోయినా వామపక్షాలతో జగన్ పొత్తు పెట్టుకునే అవకాశాలు మాత్రం కొట్టిపారేయలేం.వైసీపీ గత ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయింది. 151 స్థానాల నుంచి 11కు పడిపోయింది. దీనికి కారణాలు ఏంటన్నవి అందరికీ తెలిసినా.. వైసీపీకి మాత్రం ఇంకా బోధపడలేదు. దీంతో ఇటు పార్టీలోను, అటు నాయకుల్లోనూ మార్పు కనిపించడం లేదన్న వాదన ఉంది. వాస్తవానికి ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు కామనే అయినా.. కారణాలు తెలుసుకుని ముందుకు సాగాల్సిన అవసరం పార్టీలపై ఉంటుంది. వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి.ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత లేదా పుట్టబోయే వ్యతిరేకత తమకు మేలు చేస్తుందని వైసీపీ నాయకులు అంచనా వేసుకుంటున్నారు. వాస్తవానికి ఇది పార్టీ అధిష్టానంలోనే ఉంది. అందుకే క్షేత్రస్థాయి నాయకులు కూడా అదే దారిలో నడుస్తున్నారు. దీంతో వైసీపీలో సరైన దిశానిర్దేశం లేకుండానే నాయకులు ముందుకు సాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఫలితంగా పార్టీ పుంజుకునే విషయంలో ఇంకా వెనుక బడే ఉందన్నది వాస్తవం.ముఖ్యంగా నియోజకవర్గాల స్థాయిలో పార్టీకి భారీ ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే వైఖరి పార్టీకి కలిసి రాకపోగా.. వివాదాలకు కేంద్రంగా మారుతోంది. దీనిని సరిచేయాల్సి పార్టీ అధిష్టానం కూడా మౌనంగానే ఉండడం గమనార్హం. అంతా నేతలే చూసుకుంటారులే అనే ధోరణి అవలంభించడంతో పరిస్థితి ఇబ్బందిగానే ఉందన్నది పార్టీకి తెలిసినా.. నాయకులకు ఎలాంటి దిశానిర్దేశం చేయడం లేదు. ప్రస్తుతం ఉత్తరాంధ్రలో కేవలం నలుగురైదుగురు నాయకులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నారు.సీమలో కూడా కేవలం ఇద్దరు ముగ్గురు నేతలు మాత్రమే వాయిస్ వినిపిస్తున్నారు. ఇక, ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణాలో ఒకరిద్దరు కూడా తక్కువగానే ఉన్నారు. గుంటూరులో అయితే.. అంబటి రాంబాబు కేంద్రంగానే వైసీపీ రాజకీయాలు సాగుతున్నాయి. ఇలా.. చేయడం వల్ల పార్టీపరంగా వచ్చే ఇమేజ్ మాట ఎలా ఉన్నా.. పోతున్న ఇమేజే ఎక్కువగా ఉంది. దీంతో రాజకీయంగా వైసీపీ పుంజుకోవడం కూడా కష్టమేనన్న భావన వ్యక్తమవుతోంది. మొత్తంగా ఈ రెండేళ్లలో పార్టీ పెద్దగా పుంజుకున్నది అయితే లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఎస్సీ నియోజకవర్గంగా పులివెందుల..?

**కడప, జూలై 20, పెన్ పవర్:**
పులివెందుల పేరెత్తగానే వైఎస్ ఫ్యామిలీ గుర్తుకొస్తుంది. రాజశేఖర రెడ్డి డబుల్ హ్యాట్రిక్, జగన్ మోహన్ రెడ్డి హ్యాట్రిక్ విజయాలు సాధించిన అసెంబ్లీ స్థానం ఇది. ఇక్కడ 1978 నుంచి వైఎస్ ఫ్యామిలీదే హవా. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఇక్కడ ఒక్కసారి కూడా పసుపు జెండాను ఎగరేయలేకపోయింది. వైఎస్ కుటుంబానికి కంచుకోట లాంటి ఈ నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో జగన్ పోటీ చేయలేని పరిస్థితులు ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్ కుటుంబానికి కంచుకోట. 1978 నుంచి ఇక్కడ వైఎస్ కుటుంబ సభ్యులే ఎమ్మెల్యేలుగా గెలుస్తున్నారు. రాజశేఖర రెడ్డి ఆరుసార్లు పులివెందుల నుంచి ఎమ్మెల్యేగా గెలవగా.. 2011లో జరిగిన ఉపఎన్నికలో ఆయన సతీమణి విజయమ్మ గెలిచారు. వైఎస్ జగన్ ఇక్కడి నుంచి హ్యాట్రిక్ సాధించారు. రాజశేఖర రెడ్డి సోదరులైన పురుషోత్తం రెడ్డి, వివేకానంద రెడ్డి కూడా ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేలుగా పని చేశారు. 1983 నుంచి ఇప్పటి వరకూ టీడీపీ పులివెందులలో ఒక్కసారి కూడా గెలవలేకపోయింది.

అయితే వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి పూర్తిగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అసలు పులివెందుల నుంచి వైఎస్ జగన్, ఆయన కుటుంబీకులు పోటీ చేసే పరిస్థితి లేకపోయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదంటున్నారు. దీనికి వారు ఓ కారణాన్ని బలంగా చెబుతున్నారు. అదే నియోజకవర్గాల పునర్విభజన.2029 నాటికి డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయితే.. ఏపీలో అసెంబ్లీ, లోక్ సభ నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుంది. అదే సమయంలో నియోజకవర్గాల స్వరూపం, రిజర్వేషన్లు మారతాయి. ఈ క్రమంలోనే పులివెందుల నియోజకవర్గంలోనూ మార్పులొస్తాయని.. ఇది ఎస్సీ రిజర్వ్‌డ్‌గా మారొచ్చని లేదంటే అసలు నియోజకవర్గమే లేకుండా పోవచ్చని కొందరు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వైసీపీ కీలక నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తోన్న పుంగనూరు నియోజకవర్గానికి కూడా ఇదే పరిస్థితి ఎదురు కావచ్చని చెబుతున్నారు.దీనికి 2008 డీలిమిటేషన్‌కు సంబంధించిన ఉదాహరణలు కూడా ప్రస్తావిస్తున్నారు. 2004 ఎన్నిల వరకు కడప జిల్లాలోని బద్వేల్ నియోజకవర్గం జనరల్ స్థానంగా ఉండేదని.. కానీ పునర్విభజన తర్వాత ఎస్సీ రిజర్వ్‌డ్‌గా మారిందని గుర్తు చేస్తున్నారు. ఆ డీలిమిటేషన్‌లో కావలి నియోజకవర్గం రిజర్వేషన్ మారలేదు. కానీ ఆ నియోజకవర్గం భౌగోళిక స్వరూపం మారింది. కావలి పరిధిలోని వింజమూరు, దత్తలూరు మండలాలను ఉదయగిరి నియోజకవర్గంలో చేర్చారు. అప్పటి అల్లూరు నియోజకవర్గంలోని అల్లూరు, దగదర్తి మండలాలను కావలిలో చేర్చారు. ఫలితంగా ఉదయగిరి నియోజకవర్గంలో మండలాల సంఖ్య 8కి పెరిగింది. రాజకీయ ప్రయోజనాల కోసం కావలికి 10 కి.మీ.లో ఉండే జలదంకి మండలాన్ని (గతంలో అల్లూరు నియోజకవర్గంలో ఉండేది) తీసుకెళ్లి ఉదయగిరి నియోజకవర్గంలో కలిపారు. 2009కి ముందు చిత్తూరు పార్లమెంట్ జనరల్ స్థానంగా ఉండేది. డీలిమిటేషన్ తర్వాత అది ఎస్సీ రిజర్వ్‌డ్‌గా మారింది.2009 ఎన్నికలకు ముందు జరిగిన డీలిమిటేషన్ ప్రక్రియలో టీడీపీకి బలంగా ఉన్న స్థానాల్లో చాలా మార్పులు జరిగాయని.. అధికార కాంగ్రెస్‌కు అనుకూలంగా పునర్విభజన ప్రక్రియ జరిగిందని.. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ కూటమి కూడా డీలిమిటేషన్ ప్రక్రియను తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశాలు లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారుఅయితే నియోజకవర్గాల పునర్విభజన జరగడం అనేది పూర్తిగా పార్లమెంట్ చేతుల్లో ఉంది. 2026 ఏప్రిల్‌లో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లును ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. అయితే రాజ్యాంగ సవరణకు అవసరమైన మెజార్టీ రాకపోవడంతో ఈ బిల్లు ఆమోదం పొందలేదు. జులై 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేసేందుకు ఎన్డీయే సర్కారు ప్రయత్నించే అవకాశం ఉంది.



అక్షర గౌడ ఫ్యాషన్ సీక్రెట్స్

# మాస్ మహారాజా కొత్త లవ్ స్టోరీ... ఆ హీరోయిన్ తో రొమాన్స్ ఫిక్స్!





అదితి మెరిసే చీర లుక్‌లో తలదాచుకుంది

టాలీవుడ్‌లో సరికొత్త మల్టీస్టారర్ కాంబినేషన్లకు ఎప్పుడూ విపరీతమైన క్రేజ్ ఉంటుంది. ముఖ్యంగా బాక్సాఫీస్ వద్ద తనదైన మాస్ ఎనర్జీతో దూసుకుపోయే 'మాస్ మహారాజా' రవితేజ, విలక్షణమైన కామెడీ టైమింగ్‌తో అలరించే హీరో శ్రీవిష్ణు కలయికలో ఓ భారీ హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం రూపుదిద్దుకోబోతోంది. అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మాణంలో, టాలెంటెడ్ డైరెక్టర్ హసిత్ గోలి తెరకెక్కించనున్న ఈ సినిమా గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక సెన్సేషనల్ న్యూస్ తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ క్రేజీ మల్టీస్టారర్‌లో రవితేజ సరసన జోడీగా నటించబోయే హీరోయిన్ ఎవరనే సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. ఆ వివరాలు చూద్దాం..

**మలయాళ ముద్దుగుమ్మతో మాస్ మహారాజా రొమాన్స్:**

ఈ మోస్ట్ అవైటెడ్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో రవితేజ సరసన కథానాయికగా మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ ఎంపికైనట్లు టాలీవుడ్ వర్గాల్లో గట్టిగా టాక్ వినిపిస్తోంది. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కేయు మోహనన్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మాళవిక, తన గ్లామర్ మరియు యాక్టింగ్ స్కిల్స్‌తో సౌత్ ఇండియాలోనే మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఇక ఈ సరికొత్త కాంబో వెండితెరపై సరికొత్త రొమాంటిక్ మ్యాజిక్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

**హసిత్ గోలి మార్క్ వినోదం - క్రేజీ టైటిల్స్:**

'రాజ రాజ చోర', 'స్వాగ్' వంటి విభిన్నమైన పూర్తి వినోదాత్మక చిత్రాలతో దర్శకుడిగా తనదైన ముద్ర వేసుకున్న హసిత్ గోలి ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను హ్యాండిల్ చేస్తున్నారు. రవితేజ మాస్ క్రేజ్‌ను, శ్రీవిష్ణు సెటిల్డ్ కామెడీ టైమింగ్‌ను పర్ఫెక్ట్‌గా బ్యాలెన్స్ చేస్తూ ఆయన ఒక అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను దిల్ రాజు తన 'శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్' బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.

**2027 సంక్రాంతి బరిలో నవ్వుల జాతర:**

ఈ భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని ఫ్యామిలీ ఆడియన్స్‌ను ప్రధానంగా టార్గెట్ చేస్తూ, 2027 సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ పక్కా ప్లానింగ్‌తో ఉన్నారు. సంక్రాంతి సీజన్ అంటేనే ఫ్యామిలీస్ అన్నీ థియేటర్లకు క్యూ కడతాయి. అలాంటి టైమ్‌లో రవితేజ, శ్రీవిష్ణు కలిసి ఒకే ఫ్రేమ్‌లో కడుపుబ్బా నవ్వించడానికి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద నవ్వుల పండగ గ్యారెంటీ అనే చర్చ అప్పుడే మొదలైంది. మాళవిక మోహనన్ గ్లామర్ కూడా తోడవ్వడం ఈ పండుగ వినోదానికి మరింత ప్లస్ కానుంది.

రవితేజ, శ్రీవిష్ణు, హసిత్ గోలి, దిల్ రాజు.. ఇలా క్రేజీ టాలెంట్ అంతా ఒకే చోట చేరి సృష్టిస్తున్న ఈ సినిమా టాలీవుడ్‌లో సరికొత్త ట్రెండ్ సెట్ చేయబోతోంది. మాస్ మహారాజా పక్కన మాళవిక మోహనన్ కెమిస్ట్రీ ఎలా ఉండబోతోందో చూడాలనే కుతూహలం అందరిలోనూ ఉంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు మరియు హీరోయిన్ ఎంపికకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది. మరి 2027 సంక్రాంతి బరిలో రాబోతున్న ఈ 'వీరాధివీరులు' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డుల సంచలనం సృష్టిస్తారో చూడాలి.

# అన్ని విమర్శలకు రోహిత్ శర్మ సమాధానం ఇదే... పాక్ మాజీ క్రికెటర్ ప్రశంసలు

- ఇంగ్లండ్‌పై రోహిత్ శర్మ సెంచరీ అద్భుతమని కమ్రాన్ అక్మల్ ప్రశంస
- తన భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు రోహిత్ బ్యాట్‌తోనే జవాబిచ్చాడని వ్యాఖ్య
- రోహిత్, కోహ్లీ ఎప్పుడు రిటైర్ అవ్వాలో వారే నిర్ణయించుకుంటారని పేర్కొన్న అక్మల్
- భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని విశ్లేషణ
- కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టుకు నష్టం చేసిందని అభిప్రాయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో టీమిండియా ఓడినా, స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ చేసిన సెంచరీపై పాకిస్థాన్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్ ప్రశంసల వర్షం కురిపించాడు. రోహిత్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు, విమర్శలకు ఈ సెంచరీయే సరైన సమాధానమని అభిప్రాయపడ్డాడు. లార్డ్స్‌లో రోహిత్ (138) ఆడిన ఇన్నింగ్స్ ఒక "స్టేట్‌మెంట్ ఇన్నింగ్స్" అని, 50 ఓవర్ల ఫార్మాట్‌లో తానెందుకు అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడో మరోసారి నిరూపించుకున్నాడని అక్మల్ అన్నాడు."2027 ప్రపంచకప్ జట్టులో రోహిత్‌కు చోటు దక్కదంటూ వదంతులు వ్యాపించాయి. కానీ, ఈ రోజు తన బ్యాట్‌తోనే వాటన్నింటికీ రోహిత్ సమాధానం చెప్పాడు" అని అక్మల్ ఒక పాడ్‌కాస్ట్‌లో పేర్కొన్నాడు. రోహిత్, విరాట్ కోహ్లీ లాంటి గొప్ప ఆటగాళ్లు ఎప్పుడు తప్పుకోవాలో వారే నిర్ణయించుకుంటారని, ఎవరూ వారిని బయటకు పంపలేరని స్పష్టం చేశాడు. భారత క్రికెట్ కోసం ఎన్నో త్యాగాలు చేసిన వారిని ప్రదర్శన ఆధారంగా అంచనా వేయాలని సూచించాడు.దఅయితే, ఈ మ్యాచ్‌లో భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని అక్మల్ విశ్లేషించాడు. ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ వంటి బౌలర్లు భారీగా పరుగులు ఇవ్వడం, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టును దెబ్బతీసిందని అన్నాడు. "ప్రధాన బౌలర్లే 70 నుంచి 100 పరుగులు ఇస్తే మ్యాచ్ గెలవడం కష్టం. కుల్‌దీప్ ఉండుంటే వికెట్లు తీసి ఫలితాన్ని మార్చేవాడేమో" అని అభిప్రాయపడ్డాడు.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 387/5 భారీ స్కోరు చేయగా, భారత్ 360/7 వద్ద పరిమితమై 27 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో సిరీస్‌ను 2-1 తేడాతో ఇంగ్లండ్ కైవసం చేసుకుంది.

# ఓటమిని జీర్ణించుకోలేకపోయారా?.. అర్జెంటీనా ప్రవర్తన సిగ్గుచేటంటున్న ఫుట్‌బాల్ ప్రపంచం!

- ఫిఫా వరల్డ్ కప్ 2026 ఫైనల్లో అర్జెంటీనాపై స్పెయిన్ విజయం
- ట్రోఫీ వేడుకలో స్పెయిన్‌ను అవమానించిన అర్జెంటీనా ఆటగాళ్లు
- ట్రోఫీ వేడుకకు వీపు చూపిన మెస్సీ సేన.. ఇది సిగ్గుచేటన్న విశ్లేషకులు
- గోల్డెన్ బాల్ అవార్డు సమయంలో మెస్సీ పేరుతో అభిమానుల నినాదాలు
- మ్యాచ్‌లో, ఆ తర్వాత ఇద్దరు అర్జెంటీనా ఆటగాళ్లకు రెడ్ కార్డులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైన తర్వాత డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా ప్రవర్తించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. నిన్న న్యూయార్క్ న్యూజెర్సీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్లో స్పెయిన్ 1-0 తేడాతో అర్జెంటీనాను ఓడించి రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. అయితే, మ్యాచ్ అనంతరం జరిగిన పరిణామాలు ఫుట్‌బాల్ ప్రపంచంలో పెద్ద దుమారం రేపాయి. అర్జెంటీనా ఆటగాళ్లు, అభిమానుల ప్రవర్తన సంస్కారహీనంగా ఉందని, క్రీడాస్ఫూర్తికి మాయని మచ్చ తెచ్చిందని పలువురు విశ్లేషకులు మండిపడుతున్నారు.మ్యాచ్ ముగిసిన తర్వాత రన్నరప్ పతకాలు అందుకున్న అర్జెంటీనా ఆటగాళ్లు, కొత్త ఛాంపియన్లను అభినందించకుండా మైదానం నుంచి వెళ్లిపోయారు. స్పెయిన్ జట్టు ట్రోఫీని స్వీకరించేందుకు సిద్ధమవుతుండగా, లియోనెల్ మెస్సీ సహా అర్జెంటీనా ఆటగాళ్లందరూ మైదానంలో మరోవైపుకు వెళ్లి వీపు చూపిస్తూ నిలబడ్డారు. అంతకుముందు అర్జెంటీనా పతకాలు అందుకుంటున్నప్పుడు స్పెయిన్ ఆటగాళ్లు చప్పట్లతో అభినందనలు తెలిపినా, అర్జెంటీనా మాత్రం ఆ గౌరవాన్ని తిరిగి ఇవ్వలేదు. ఇది ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.ఇక, టోర్నమెంట్‌లో అత్యుత్తమ ఆటగాడిగా నిలిచిన స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ రోడ్రి 'గోల్డెన్ బాల్' అవార్డు అందుకుంటున్నప్పుడు స్టేడియంలోని అర్జెంటీనా అభిమానులు 'మెస్సీ, మెస్సీ' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ పరిణామం అక్కడి వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఈ ఘటనలపై +శీశ్రీ.ఎశీఎ కథనం ప్రకారం.. టాక్‌స్పోర్ట్ బ్రాడ్‌కాస్టర్ అడ్రియన్ దర్హామ్ తీవ్రంగా స్పందించారు. "వారిలో కనీస సంస్కారం లేదు. ఈ రోజు వారు సిగ్గుపడే రీతిలో ప్రవర్తించారు. ఫైనల్లో ఓటమిని వారు అంగీకరించలేకపోతున్నారు. అర్జెంటీనా జట్టు ఈ ఆటకు, ప్రపంచకప్‌కు పూర్తి అవమానం" అని ఆయన ఘాటుగా విమర్శించారు.

"ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత సులువైన గ్రూప్‌లో డ్రా పొంది, నాకౌట్ దశలో కష్టపడి గెలిచి, ఇక్కడికొచ్చి తమను తాము అవమానించుకున్నారు" అని దర్హామ్ వ్యాఖ్యానించారు. టోర్నీ ఆద్యంతం అర్జెంటీనాకు అనుకూలంగా అనేక నిర్ణయాలు వచ్చాయని ఆయన ఆరోపించారు.

నిజానికి ఫైనల్ ముగిసిన వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లలో అసహనం కట్టలు తెంచుకుంది. దాంతో స్పెయిన్ ఆటగాళ్లపై దురుసుగా ప్రవర్తించారు. స్పెయిన్ ఆటగాళ్లతో గొడవకు దిగినందుకు లియాండ్రో పరేడెస్‌కు రెడ్ కార్డ్ చూపించారు. అంతకుముందు ఆట అదనపు సమయంలో ఎంజో ఫెర్నాండెజ్ కూడా రెండో ఎల్లో కార్డ్‌తో మైదానం వీడాడు. దీంతో ప్రపంచకప్ ఫైనల్లో రెడ్ కార్డ్ పొందిన ఆరో ఆటగాడిగా నిలిచాడు.

ఈ విజయంతో స్పెయిన్ రెండోసారి ప్రపంచకప్ గెలవడమే కాకుండా వరుసగా 38 మ్యాచ్‌లలో అపజయం ఎరుగని యూరోపియన్ జట్టుగా రికార్డు సృష్టించింది. అయితే, స్పెయిన్ చారిత్రక విజయం కంటే అర్జెంటీనా వివాదాస్పద ప్రవర్తనే ఎక్కువగా చర్చనీయాంశంగా మారింది.

# రూమర్స్ ఉంటనే మజా: రిటైర్మెంట్ పుకార్లపై తొలిసారి నోరువిప్పిన రోహిత్



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూఢిల్లీ: క్రికెట్ మక్కాగా పేరొందిన ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో చారిత్రాత్మక సెంచరీతో విమర్శకుల నోర్లు మూయించిన టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ తొలిసారి తన రిటైర్మెంట్ పుకార్లపై స్పందించారు. ఇంగ్లాండ్?తో వన్డే సిరీస్ ముగిసిన అనంతరం హిట్ మ్యాన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇటువంటి రూమర్స్, విమర్శలు ఉంటేనే మజా ఉంటుందని అన్నారు. తనకు విమర్శలు కొత్తేమి కాదని.. తన సుదీర్ఘ కెరీర్?లో ఇటువంటి అటుపోట్లు ఎన్నో చూశానని అన్నారు. ఇటువంటి విమర్శలు, రూమర్స్ ఎన్ని వచ్చిన తాను పట్టించుకోనని.. తన దృష్టి మొత్తం కేవలం ఆటపైనే ఉంటుందని స్పష్టం చేశారు."నేను అరంగేట్రం చేసినప్పటి నుంచి నాపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. నేను జట్టులో ఉన్నంత కాలం ఆ విమర్శలు వస్తూనే ఉంటాయి. అది నాకు ముఖ్యం కాదు. మైదానంలో నేను ఏమి చేస్తాననేదే ముఖ్యం. జట్టు విజయంలో నా వంతు సహకారం అందించడానికి ప్రయత్నించాలనుకుంటున్నాను. నా దృష్టి అంతా దానిపైనే ఉంది. అయినా ఇలాంటి రూమర్స్, విమర్శలు లేకపోతే సరదా ఉండదు" అని రోహిత్ శర్మ పేర్కొన్నారు.

**విరాట్ తో బ్యాటింగ్ వేరే లెవల్:**

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో తన స్నేహం, కలిసి బ్యాటింగ్ చేయడం గురించి రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కోహ్లీతో కలిసి బ్యాటింగ్ చేయడం చాలా సరదగా ఉంటుందన్నాడు. మేము ఒకరినొకరు బాగా అర్థం చేసుకుంటామని.. క్రీజులో ఆలోచనలను పంచుకుంటామని తెలిపారు. కెరీర్?లో కోహ్లీ, తాను ఎన్నో విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పామని చెప్పారు. లార్డ్స్ వన్డేలో మా ఇద్దరి పార్టనర్ షిప్ కూడా చాలా బాగుందన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com